ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పల్నాడు జిల్లా వార్తలు
7
శనివారం 7 డిసెంబరు 2024





సమావేశం కోసం సర్వాంగ సుందరంగా ఏర్పాటుచేసిన మున్సిపల్ హైస్కూల్ ప్రాంగణం

- జిల్లా అంతటా రెవెన్యూ సదస్సులు
- తొలి రోజు అప్పటికప్పుడే 8 అర్జీల పరిష్కారం
- గోళ్లపాడులో సదస్సు ప్రారంభించిన కలెక్టర్ అరుణ్‌బాబు
- బొల్లాపల్లిలో అర్జీలు స్వీకరించిన చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

28 గ్రామాలు.. 468 అర్జీలు



బొల్లాపల్లి సదస్సులో మాట్లాడుతున్న జీవీ ఆంజనేయులు



పిడుగురాళ్ల: జానపాడు సదస్సులో యరపతినేని, జంగా



సత్తెనపల్లి: గోళ్లపాడు రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

నరసరావుపేట, ముప్పాళ్ల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): భూవివాదాలు.. సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రెవెన్యూ సదస్సులు జిల్లా అంతటా శుక్రవారం ప్రారంభమయ్యాయి. భూముల పరంగా ఉన్న చిక్కులను తొలగించడంతో పాటు ఐదేళ్లలో వైసీపీ చేసిన అక్రమాలను నిగ్గుతేల్చి బాధితులకు అండగా ఉండేందుకు రెవెన్యూ సదస్సులకు ప్రభుత్వం శ్రీకారంచుట్టగా ఆయా గ్రామాల్లో భూ యజమానులు, రైతులువారి సమస్యలను అధికారుల దృష్టి తీసుకొచ్చారు. భూ సమస్యల పరిష్కారం కోరుతూ తొలిరోజు సదస్సుల్లో బాధితులు 468 అర్జీలను అందజేశారు. వాటిని స్వీకరించిన అధికారులు అప్పటికప్పుడు 8 అర్జీలను పరిష్కరించారు. బొల్లాపల్లిలో ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, ముప్పాళ్లలో కలెక్టర్ అరుణ్‌బాబు సదస్సులను ప్రాంభించారు.

● ఎన్నో ఏళ్లగా ఎదురుచూస్తున్న భూ సమస్యలను రెవెన్యూ సదస్సుల ద్వారా పరిష్కరిస్తామని బొల్లాపల్లి రామాలయం వద్ద ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సులో పాల్గొన్న చీఫ్‌విప్ జీవీ తెలిపారు. అగ్రహారం భూ సమస్యలు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. జగన్ పాలనలో తుపాకీలు గురిపెట్టి ప్రజల ఆస్తులను కొల్లగొట్టారని విమర్శించారు. లంచాల పేరుతో రైతులను ఇబ్బంది పెడితే కఠినచర్యలు తీసుకుంటామని అధికారులను హెచ్చరించారు. భూ కబ్జాలపై రెండు నుంచి 15 ఏళ్ల వరకు జైలు శిక్ష పడేలా ప్రభుత్వం చట్టాన్ని తీసుకువచ్చిందన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో మాధవీలత పాల్గొన్నారు.

● ముప్పాళ్ల మండలం గోళ్లపాడు సదస్సులో కలెక్టర్ అరుణ్‌బాబు మాట్లాడుతూ ఏళ్ల తరబడి చిన్నచిన్న కారణాలతో రైతులు భూ వివాద సమస్యలతో చితికిపోతున్నారన్నారు. ఇలాంటి వారికి రెవెన్యూ సదస్సులు పరిష్కార వేదికలు కావాలన్నారు. కుటుంబ వివాదాల కారణంగా భూసమస్యలు పెరిగిపోయాయన్నారు. కోర్టు కేసులు, ఇతర వివాదాలు లేని ప్రతి అర్జీని పరిష్కరించడానికి అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. సదస్సులో స్వీకరించే ప్రతి అర్జీకి తప్పని సరిగా రశీదు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ప్రతి అర్జీని నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో విలియమ్స్, తహసీల్దారు భవానీశంకర్, డీటీ లక్ష్మీప్రసాద్, ఈవోపీఆర్డీ రూపవతి తదితరులు పాల్గొన్నారు.

● పిడుగురాళ్ల మండలం జానపాడు సదస్సులో బాధితుల నుంచి ఎమ్మెల్సీ, టీటీడీ బోర్డు సభ్యుడు జంగా కృష్ణమూర్తి, ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అర్జీలు స్వీకరించారు.

● కారంపూడి మండలం నరమాలపాడు, దుర్గి మండలం అడిగొప్పులలో జరిగిన రెవెన్యూ సదస్సుల్లో ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి పాల్గొన్నారు.

లంచం తీసుకున్నారని వీఆర్వోలపై ఫిర్యాదు..

వైసీపీ ప్రభుత్వంలో వీఆర్‌వోలు రూ.60 వేలు లంచం తీసుకుని పని చేయకుండా తిప్పుతున్నారని గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు అనే రైతు బొల్లాపల్లి జరిగిన రెవెన్యూ సదస్సులో అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. రూ.15 వేలు తీసుకుని పని చేయకుండా బదిలీపై వెళ్లిపోయారని మరో రైతు ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. రైతుల వద్ద డబ్బులు తీసుకున్న వీఆర్‌వోలపై కఠినచర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు.

- నేడు పాఠశాలల్లో మెగా పేరెంట్-టీచర్ మీట్
- చారిత్రక కార్యక్రమానికి వేదికగా బాపట్ల హైస్కూల్
- హాజరుకానున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్
- విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో మమేకం కానున్న సీఎం
- తల్లిదండ్రులకు పాఠశాలల్లో ఆటల పోటీలు.. భోజన ఏర్పాట్లు

సరికొత్తగా.. బడి పండుగ

(బాపట్ల, ఆంధ్రజ్యోతి) సరికొత్తగా.. తొలిసారిగా.. ఆహ్లాదకర వాతావరణంలో, హంగు ఆర్భాటాలు లేకుండా, రాజకీయాలకు అతీతంగా, పూర్తిగా విద్యా సంబంధమైన వాతావరణంలో, ఆత్మీయ వాతావరణంలో, విద్యార్థులను ఉత్తేజపరిచేలా బడి పండుగ జరగనున్నది. మెగా పేరెంట్-టీచర్ మీట్ పేరిట ప్రభుత్వ పాఠశాలల్లో కార్యక్రమం నిర్వహించే సరికొత్త చరిత్రకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. దేశంలో ఢిల్లీ మినహా మిగిలిన ఏ రాష్ట్రాల్లో కూడా ఇలాంటి కార్యక్రమం జరిగిన దాఖలాలు లేవు. ఏపీలో ఇలాంటి వినూత్న కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు శ్రీకారం చుట్టారు. శనివారం జరగబోయే ఈ కార్యక్రమానికి బాపట్ల మున్సిపల్ హైస్కూల్ వేదికగా మారనుండగా సీఎం చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి లోకేశ్ హాజరుకానున్నారు. ఇదిలా ఉంటే ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు తొలిసారి బాపట్ల జిల్లాకు రానుండటంతో పాటు ఓ మెగా కార్యక్రమానికి బాపట్లను వేదిక చేసుకోవడం విశేషం. పూర్తి ఆహ్లాదకర వాతావరణంలో పేరెంట్-టీచర్ మీట్ జరిపేలా అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇతర అంశాలకు అవకాశం లేకుండా అంతా విద్యా సంబంధమైన వాతావరణమే కనబడేలా అధికారులు చర్యలు చేపట్టారు. హైస్కూల్ విద్యార్థులతో సీఎం మమేకమై వారికి భవిష్యత్తుపై దిశానిర్దేశం చేయనున్నారు. తల్లిదండ్రులతో ముఖాముఖిలో ఇంటి దగ్గర పిల్లలకు కల్పించాల్సిన వాతావరణంతో పాటు ఉపాధ్యాయులతో క్రమం తప్పకుండా సమావేశమై విద్యార్థి ప్రోగ్రెస్ గురించి తెలుసుకోవాలని కూడా వారికి సూచించనున్నారు. హైస్కూల్‌లో భోజనాలకు ప్రత్యేకంగా కుటీరాలు ఏర్పాటు చేశారు. విద్యార్థుల తల్లులకు నిర్వహించే ముగ్గుల పోటీలకు ఏర్పాట్లు చేయగా తండ్రులకు టగ్గాఫ్‌వార్ నిర్వహించేందుకు క్రీడా వికాస కేంద్రాన్ని ముస్తాబు చేశారు.

ఏర్పాట్లు పరిశీలించిన అధికారులు

బాపట్లలో ముఖ్యమంత్రి పర్యటనలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా ప్రతి అధికారి విధులను సమర్థంగా నిర్వహించాలని ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి తెలిపారు. ఎస్పీ తుషార్‌డూడీ, ఇతర అధికారులతో కలిసి శుక్రవారం ఏర్పాట్లు పరిశీలించి బందోబస్తు విధుల గురించి దిశనిర్దేశం చేశారు. హెలీప్యాడ్ నుంచి మున్సిపల్ హైస్కూల్ వరకు సీఎం కాన్వాయ్ ట్రయిల్ రన్‌ను ఎస్పీ నిర్వహించారు. హైస్కూల్ ప్రాంగణంలో ఏర్పాట్లను విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు సమగ్రశిక్షాభియాన్ స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాసరావు, కలెక్టర్ జె.వెంకటమురళితో కలిసి పరిశీలించారు. బాపట్ల హైస్కూల్ ప్రాంగణాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు.

ముఖ్యమంత్రి పర్యటన సాగేదిలా...

ఉదయం 10:20 గంటలకు పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లోని ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్దకు చేరుకోనున్న చంద్రబాబు అక్కడ ఐదు నిమిషాలు మాత్రమే నేతలతో మాట్లాడనున్నారు. అక్కడ నుంచి రోడ్డుమార్గంలో బయలుదేరి 10:30కు హైస్కూల్ చేరుకోనున్నారు. మధ్యాహ్నం 1:30 వరకు మెగా పేరెంట్-టీచర్ మీట్‌లో పాల్గొననున్న చంద్రబాబు 1:40కి తిరుగు పయనమై ఉండవల్లిలోని నివాసానికి చేరుకోనున్నారు.

మధురానుభూతిని మిగిల్చేలా..

మెగా పేరెంట్-టీచర్ మీట్‌లో విద్యార్థులు వారి తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయులు అంతా ఒకే వేదికపైకి చేరడం మొదలు అందరూ కలిసి భోజనం చేయడం వరకు ప్రతిదీ ఓ మధురానుభూతిని మిగిల్చేలా అధికారులు కార్యక్రమం రూపొందించారు. విద్యార్థులకు, తల్లిదండ్రులకు వివిధ పోటీలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. పూర్వ విద్యార్థుల స్ఫూర్తి గాథలు విద్యార్థులకు తెలియజేసి వారిలో పోటీతత్వాన్ని పెంచనున్నారు. దాతలను కూడా ఈ వేదికపై నుంచి సన్మానించుకోనున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పండుగ వాతావరణంలో ఈ కార్యక్రమం జరగనున్నది. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మెగా సమావేశానికి పాఠశాలలు సిద్ధమయ్యాయి. అన్ని పాఠశాలల్లో తరగతి గదుల్ని విద్యార్థులు రంగు కాగితాలతో ప్రత్యేకంగా అలకరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పండుగ వాతావరణంలో వేడుకల్ని నిర్వహించేలా ఉపాధ్యాయులు ప్రణాళికలు సిద్ధం చేశారు. స్థానిక ప్రజా ప్రతినిధుల్ని, ఎమ్మెల్యేలను కార్యక్రమానికి ప్రత్యేకంగా ఆహ్వానిస్తున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా దాదాపు 6లక్షల మందికిపైగా విద్యార్థులు, 2లక్షలకుపైగా తల్లిదండ్రులు సమావేశాల్లో పాల్గొంటారని విద్యాశాఖ అంచనా వేస్తోంది.



బాపట్ల మున్సిపల్ హైస్కూల్ ప్రాంగణాన్ని పరిశీలించి సిబ్బందికి దిశానిర్దేశం చేస్తున్న ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, ఎస్పీ దూడీ

ఐసీఐసీఐ బ్యాంక్ కుంభకోణం కేసులో మరొకరు అరెస్టు
ఆగి ఉన్న లారీని ఢీకొన్న బస్సు
● ఒకరు మృతి.. ఆరుగురికి గాయాలు
8

గంజాయి, ఎర్ర చందనం అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా
గుంటూరు ఎస్పీ సతీశ్‌కుమార్ వెల్లడి
10

దటీజ్.. లోకేశ్

- ప్రజాదర్బార్ దిగ్విజయంగా 50 రోజులు పూర్తి
- ఇప్పటివరకు వచ్చిన వినతులు 5810
- పూర్తిగా పరిష్కారం చూపినవి 4400



వినతిపత్రాలు స్వీకరిస్తున్న మంత్రి నారా లోకేశ్

ఓబీసీల కుల గణన చేపట్టేలా చొరవ చూపాలి


ఢిల్లీలో కేంద్ర మంత్రి పెమ్మసానికి వినతిపత్రం అందజేస్తున్న కేసన శంకరరావు, శ్రీనివాస్‌గౌడ్

గుంటూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా నిర్వహించే జనగణనతోపాటు సమగ్ర కులగణన జరపాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి, సమాచార ప్రసార శాఖల సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌ను ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు, జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ నేతృత్వంలో ఆంధ్ర, తెలంగాణ ఓబీసీ ప్రతినిధి బృందం సభ్యులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఢిల్లీలో కేంద్రమంత్రిని కలిసిన వారు వినతిపత్రం అందజేశారు. జనగణనతో పాటు కుల జనగణన చేపట్టేలా కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి, పార్లమెంటులో చట్టం చేయాలని కోరారు. ఈ మేరకు ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఈనెల 5న కులగణన అంశంపై మహా ధర్నాను నిర్వహించామని కేసన తెలియజేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నవరపు నాగమల్లేశ్వరరావు, రాయలసీమ ప్రధాన కార్యదర్శి రఘుపతి, జ్ఞాన జగదీష్, విక్రమ్ గౌడ్, శ్రీనివాస్, మట్లపూడి పూర్ణచంద్రరావు తదితరులున్నారు.

వైసీపీ దుష్ప్రచారాలను నమ్మవద్దు

● మంత్రి గొట్టిపాటి రవి కుమార్

సత్తెనపల్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ, ఎస్టీలకు అందించే ఉచిత విద్యుత్‌పై వైసీపీ చేస్తున్న దుష్ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ అన్నారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని టీడీపీ ప్రజా వేదికలో జరిగిన కార్యక్రమంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలకు రెండు వందల లోపు యూనిట్లకు ఉచితంగా విద్యుత్‌ను అందిస్తామన్నారు. వ్యవసాయ మోటార్లకు స్మార్ట్ మీటర్లు బిగించే ప్రసక్తే లేదని అన్నారు. త్వరలో డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేస్తామన్నారు. రాష్ట్రంలో ఐదు సంవత్సరాల వైసీపీ పాలనలో పేరుకు పోయిన భూ సమస్యల పరిష్కారం కోసమే కూటమి ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందన్నారు. సదస్సులను ప్రజలు ఉపయోగించుకోవాలని ఆయన కోరారు. రాష్ట్రంలో లక్షలాది మందికి పింఛన్‌లు అందిస్తున్న ఘనత కూటమి ప్రభుత్వందేనన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను ప్రాధాన్యత క్రమంలో అమలు చేస్తుందన్నారు. ఆయనతో పాటు ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు, ఎస్పీ కే శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

26 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

నాదెండ్ల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఒక ప్రైవేట్ బస్సులో తరలిస్తున్న 26 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని నాదెండ్ల పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నాదెండ్ల గ్రామంలోని బస్టాండ్ సమీపంలో గురువారం అర్ధరాత్రి ఈ బస్సును పోలీసులు స్వాధీనం చేసుకొని పోలీసు స్టేషన్‌కు తరలించారు. బియ్యాన్ని గుంటూరు సమీపంలోని అనంతవరప్పాడు రైస్ మిల్లుకు తరలించినట్లు తెలిసింది. చందవరం, చిరుమామిళ్ళ, నాదెండ్ల గ్రామాలకు చెందిన ఈ ముగ్గురు వ్యాపారులు బియ్యాన్ని కొనుగోలు చేసి తరలిస్తున్నట్టు సమాచారం. రాజకీయ ఒత్తిడి నేపథ్యంలో ఈ విషయాన్ని నాదెండ్ల పోలీసులు గోప్యంగా ఉంచారు. ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం.

సీఎం పర్యటనకు పకడ్బందీగా ఏర్పాట్లు

● రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు


కలెక్టర్ జె.వెంకటమురళి, ఎస్పీ తుషార్ డూడికి, అధికారులకు సూచనలు చేస్తున్న రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు

బాపట్ల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హాజరయ్యే తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశంలో ఎలాంటి సమస్యలు రాకుండా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు అన్నారు. మున్సిపల్ హైస్కూల్ ప్రాంగణాన్ని శుక్రవారం ఆయన సమగ్ర శిక్షాభియాన్ స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాసరావు, కలెక్టర్ జె.వెంకటమురళి, ఎస్పీ తుషార్ డూడి, జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్‌లతో కలిసి పరిశీలించారు. హెలిప్యాడ్ నుంచి కాన్వాయ్, ముఖ్యమంత్రి పర్యటన కార్యక్రమంపై ట్రయిల్ రన్ నిర్వహించారు. వేదికను పరిశీలించారు. పాఠశాలకు చేరుకోగానే విద్యార్థులే సంప్రదాయ దుస్తులతో ఆహ్వానం పలికేలా చూడాలన్నారు. ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం చేయటానికి విద్యార్థులు, తల్లిదండ్రులు సహకరించాలన్నారు. కార్యక్రమంలో అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.

విధులు సమర్థవంతంగా నిర్వహించాలి: ఐజీ

బాపట్ల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రతి అధికారి విధులను సమర్థవంతంగా నిర్వహించాలని గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి సూచించారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా శుక్రవారం బాపట్ల విచ్చేసిన ఆయన ఎస్పీ తుషార్‌డూడి, పోలీసు అధికారులకు బందోబస్తు విధులపై దిశానిర్దేశం చేశారు. ప్రవేశ ద్వారాల వద్ద ప్రతి ఒక్కరిని క్షుణ్ణంగా తనిఖీ చేసి సంబంధిత ప్రభుత్వ అధికారులు జారీ చేసిన పాస్, ఆహ్వాన పత్రాలు ఉన్న వారిని మాత్రమే లోపలకు అనుమతించాలని సూచించారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందు నుంచే తగిన చర్యలు తీసుకోవాలన్నారు. హెలీప్యాడ్ వద్ద విధులు నిర్వహించే అధికారులు వారికిచ్చిన జాబితాలో ఉన్నవారిని మాత్రమే క్షుణ్ణంగా తనిఖీ చేసి ముఖ్యమంత్రిని కలవటానికి అనుమతించాలన్నారు. అడిషనల్ ఎస్పీ టీపీ విఠలేశ్వర్, డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి కాన్వాయ్ ట్రయిల్ రన్

బాపట్ల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు శనివారం బాపట్ల మున్సిపల్ హైస్కూల్‌కు విచ్చేయుచున్న నేపథ్యంలో శుక్రవారం ఎస్పీ తుషార్ డూడి హెలీప్యాడ్ నుంచి మున్సిపల్ హైస్కూల్ వరకు సీఎం కాన్వాయ్ ట్రయిల్ రన్ నిర్వహించారు. భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో ముఖ్యమంత్రి సమావేశం అయ్యే తరగతి గదులను పరిశీలించారు. ముఖ్యమంత్రి పాల్గొనే వివిధ కార్యక్రమాల వద్ద భద్రత ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు, సిబ్బందికి పలుసూచనలు చేశారు.

స్వల్పట్రాఫిక్ మళ్లింపు

ముఖ్యమంత్రి వచ్చిన కొద్దిసేపు మాత్రమే తాత్కాలికంగా ట్రాఫిక్ మళ్లింపు జరుగుతుందని ఎస్పీ తుషార్ డూడి తెలిపారు.

● చీరాల నుంచి బాపట్ల మీదగా పొన్నూరు, గుంటూరు వైపు వెళ్లే వాహనాలు అంబేద్కర్ సర్కిల్, జమ్ములపాలెం ఫ్లైఓవర్, ఉప్పరపాలెం, ఇందిరాగాంధీ సర్కిల్, దర్గామీదగా దారి మళ్లిస్తున్నట్లు తెలిపారు.

● బాపట్ల నుంచి కర్లపాలెం, చెరుకుపల్లి, రేపల్లె వైపు వెళ్లే వాహనాలు గడియార స్తంభంసెంటర్, జాతీయ రహదారి 216 మీదగా దారి మళ్లిస్తున్నట్లు తెలిపారు.

● ఉప్పరపాలెం రైల్వేగేటు, ఆర్‌అండ్‌బీ బంగ్లామీదగా మున్సిపల్ హైస్కూల్ వైపు వచ్చే వాహనాలు ఉప్పరపాలెం ఇందిరాగాంధీ సర్కిల్ నుంచి జమ్ములపాలె ఫ్లైఓవర్ మీదగా దారి మళ్లిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా ఉప్పరపాలెం వెళ్లే వాహనాలను కూడా జమ్ములపాలెం ఫ్లైఓవర్ మీదగా దారి మళ్లిస్తున్నట్లు చెప్పారు.

కన్నా రంగయ్య ఛారిటబుల్ ట్రస్ట్ సేవలు ప్రశంసనీయం

● రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్


ఆల్కలైన్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న మంత్రి గొట్టిపాటి రవి కుమార్, ఎమ్మెల్యే కన్నా

సత్తెనపల్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సత్తెనపల్లిలో కన్నా రంగయ్య ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కొనసాగిస్తున్న సేవలు ప్రశంసనీయమని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ అన్నారు. పట్టణంలోని రఘురామ్ నగర్‌లో కన్నా రంగయ్య ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.1.30 కోట్లతో ఏర్పాటు చేసిన ఆల్కలైన్ వాటర్ ప్లాంట్‌ను రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణతో కలసి ప్రారంభించారు. అనంతరం ప్రజా వేదికలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సేవా ట్రస్ట్ ద్వారా రాష్ట్రంలో ఏర్పాటు చేసిన మొదటి ఆల్కలీన్ వాటర్ ప్లాంట్ ఇదేనన్నారు. ప్రజల, విద్యార్థుల, సామాజిక అవసరాల కోసం వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసిన కన్నా లక్ష్మీనారాయణను ఆయన అభినందించారు. వివిధ పాఠశాలల విద్యార్థులకు, ఏరియా వైద్యశాలకు ఉచితంగా వాటర్ సరఫరా చేయనుండటం అభినందనీయమన్నారు. తన నియోజకవర్గంలో కూడా ఇలాంటి వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. వెనుకబడిన పల్నాడు అభివృద్ధికి పరిశ్రమలు తీసుకురావాలని కన్నా లక్ష్మీనారాయణ కోరారని, రిలయన్స్ సంస్థ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ఐదు వందల గ్యాస్ ఉత్పత్తి ప్లాంట్లు ఏర్పాటు చేయించాలనేది ముఖ్యమంత్రి నిర్ణయం అన్నారు. దీని వల్ల నిరుద్యోగ యువతకు ఉపాధి లభిస్తుందన్నారు. ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ట్రస్ట్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. సత్తెనపల్లి పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలు, ప్రభుత్వ ఆస్పత్రి, రామకృష్ణాపురంలోని గురుకుల పాఠశాలకు వాటర్‌ను ఉచితంగా అందిస్తామన్నారు. త్వరలో నియోజకవర్గమంతా సేవలను విస్తరింప చేస్తామన్నారు. జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు, ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ తన తండ్రి పేరిట ట్రస్ట్ ద్వారా ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ఆల్కలీన్ వాటర్‌ను ఉచితంగా పంపిణీ చేయటం అభినందనీయన్నారు. ఈ సందర్భంగా మినీ వాటర్ ట్యాంకులను స్కూల్ ప్రధానోపాధ్యాయులకు మంత్రి, ఎమ్మెల్యే, అతిథులు అందించారు. దాతల సహకారంతో అర్బన్ హెల్త్ సెంటర్లకు ఇన్వర్టర్లు, కుర్చీలు, బెడ్ షీట్లను మంత్రి గొట్టిపాటి రవి కుమార్, ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అందించారు. దాతలను అభినందించారు. మంత్రి గొట్టిపాటి రవి కుమార్‌ను కన్నా లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ట్రస్ట్ డైరెక్టర్ కన్నా నాగరాజు, ఆర్డీవో రమణాకాంత్‌రెడ్డి, టీడీపీ రాష్ట్ర నాయకులు నాగోతు శౌరయ్య, ఎలినేడి రామస్వామి, చౌట శ్రీనివాసరావు, భీమినేని వందనాదేవి, మన్నెం శివ నాగమల్లేశ్వరరావు, నూర్ బాషా, జాన్ బాబు, ఎంతవో శ్రీనివాసరావు, ఆతుకూరి శ్రీనివాసరావు, బండారు నాగరాజు, అంకాళ్ళ ప్రభుదాసు, ఆళ్ళ అమరేశ్వరరావు, పూజల వెంకట కోటయ్య, మక్కపాటి రామచంద్రరరావు, పల్లపాటి పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు ముమ్మరం

అమరావతి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్లు ఊపందుకున్నాయి. రైతులకు మద్దతు ధర ప్రకారం సొమ్ములు వేగంగా వారి ఖాతాల్లో జమవుతున్నాయి. శుక్రవారం ఒక్క రోజే రికార్డు స్థాయిలో 5,731 మంది రైతుల నుంచి 40,811 టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి.. రూ.94.01 కోట్ల మొత్తాన్ని రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఒక ప్రకటనలో వెల్లడించారు. దీంతో ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ఇప్పటి వరకు మొత్తం 1,67,299 మంది రైతుల నుంచి 11,63,510 టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు వివరించారు. గత ఏడాది ఇదే సమయానికి కేవలం 5.22 లక్షల టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలు చేయగా.. ఈ ఏడాది 11 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా ధాన్యాన్ని కొనుగోలు చేసినట్టు తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వంలో రైతులు ధాన్యాన్ని మద్దతు ధరకు అమ్ముకోవడానికి అనేక ఇబ్బందులు పడ్డారని, ర్యాండమైజేషన్ పేరుతో నిర్దేశించిన మిల్లులకే తరలించాలనే నిబంధన వల్ల ధాన్యం తరలింపు రైతులకు తలకుమించిన భారంగా పరిణమించిందన్నారు. ధాన్యం సంచుల కోసమే రోజుల తరబడి రైతు భరోసా కేంద్రాల చుట్టూ తిరగాల్సిన దుస్థితి గత ప్రభుత్వంలో ఉండేదన్నారు. అయినప్పటికీ ఎన్నో వ్యయప్రయాసల కోర్చి లారీల్లో సుదూర ప్రాంతాల్లోని మిల్లులకు తరలించినా.. రోజుల తరబడి దిగుమతి చేసుకోకుండా మిల్లర్లు రైతులను ఇబ్బందులకు గురిచేశారని పేర్కొన్నారు. పైగా తేమ శాతం పేరుతో మిల్లర్లు భారీగా కోతలు విధించడం, ఆ తరుగుకు సమానమైన సొమ్మును రైతులు ముందుగా చెల్లిస్తేనే ధాన్యాన్ని దిగుమతి చేసుకోవడం.. ఇలా అడుగడుగునా సాగిన దోపిడీతో రైతులు నష్టపోయారన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం విక్రయించిన రైతులకు రెండు, మూడు నెలల వరకు సొమ్ము చెల్లించకుండా గత వైసీపీ ప్రభుత్వం బకాయిలు పెట్టిందన్నారు. దీంతో ఎక్కువ మంది రైతులు ప్రైవేటు వ్యాపారులు, దళారులకు తక్కువ ధరకే అమ్ముకోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని చెప్పారు. కూటమి ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియలో సమూల మార్పులు చేసిందన్నారు. ర్యాండమైజేషన్ నిబంధనను తొలగించి రైతులు విక్రయించిన ధాన్యాన్ని సమీపంలోని ఏ రైసు మిల్లుకైనా తరలించుకునే సౌలభ్యం కల్పించిందని మంత్రి చెప్పారు. మద్దతు ధర ప్రకారం 48 గంటల్లోపే రైతుల ఖాతాల్లో సొమ్ము జమ చేస్తున్నట్లు వివరించారు. ఉత్తరాంధ్రలోని శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, మన్యం జిల్లాల తోపాటు కోస్తాలోని తూర్పు, పశ్చిమగోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు ఉమ్మడి జిల్లాల్లో ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోళ్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయని నాదెండ్ల తెలిపారు.

14న విజయవాడలో ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవ సభ

అమరావతి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): విజయవాడలో ఈ నెల 14న దివంగత ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవ సభ జరగనుంది. దీనికి ముఖ్య అతిథులుగా సీఎం చంద్రబాబు, మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు హాజరు కానున్నారు. ఎన్టీఆర్ స్మారక సాహిత్య కమిటీ అధ్యక్షుడు టీడీ జనార్దనరావు శుక్రవారం విజయవాడలో మీడియాతో మాట్లాడుతూ.. "గత నెల 24నాటికి ఎన్టీఆర్ తొలి సినిమా 'మన దేశం' విడుదలై 75 ఏళ్ల పూర్తయ్యాయని, ఆ సందర్భాన్ని పురస్కరించుకుని ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవ వేడుకను నిర్వహిస్తున్నామని తెలిపారు. "తెలుగు సినీ జగత్తులోనే కాకుండా భారతీయ సినీ రంగంలో ఎన్టీఆర్ ఒక మేరునగధీరుడు. పౌరాణికం, చారిత్రికం, జానపదం, సాంఘికం.. ఇలా ప్రతి పాత్రలోనూ ఆయన మేటి నటుడిగా నిలిచారు. ఒకే సినిమాలో నాయక, ప్రతినాయక పాత్రలు వేశారు. తనను ఎంతో ఆదరించిన ప్రజల రుణం తీర్చుకోవడానికి రాజకీయ రంగంలోకి వచ్చిన ఆయన పేదవాడి మనసు తెలిసి వాళ్ల అవసరాలు తీర్చడానికి ఎంతో ప్రయత్నం చేశారు. 40 ఏళ్ల క్రితమే నదుల అనుసంధానం గురించి... రాయలసీమకు సాగునీటి ప్రాజెక్టుల అవసరాల గురించి ఆలోచన చేశారు. వజ్రోత్సవ వేడుకలకు ఎన్టీఆర్ కుమార్తెలు, కుమారులు పురందేశ్వరి, రామకృష్ణ, మోహనకృష్ణతోపాటు అక్కినేని నాగేశ్వరరావు, చిరంజీవి, కృష్ణ, రామానాయుడు కుటుంబ సభ్యులు కూడా హాజరవుతున్నారు. సినీ రంగంలో ఎన్టీఆర్‌తోపాటు కలిసి పనిచేసిన కళాకారులు, టెక్నీషియన్లు, దర్శకులను కూడా ఆహ్వానిస్తున్నాం. ఈ నెల 14న విజయవాడ శివారులోని పెనమలూరు నియోజకవర్గం పరిధిలో ఉన్న ఓ రిసార్ట్‌లో ఈ కార్యక్రమం జరుగుతుంది" అని జనార్దనరావు వివరించారు. ఎన్టీఆర్ సినీ విశేషాలతో ఒక యూట్యూబ్ చానల్ ఏర్పాటు చేస్తే రెండున్నర నెలల్లో దానిని 1.26 కోట్ల మంది చూశారని, 27 వేల మంది సబ్‌స్క్రయిబ్ చేశారని చెప్పారు. మన దేశం నుంచి మొదలుకొని ఎన్టీఆర్ నటించిన మూడు వందల సినిమాలకు సంబంధించిన సంక్షిప్త సమాచారంతో 'తారక రామం' పేరుతో ఒక పుస్తకాన్ని వజ్రోత్సవ వేడుకలో విడుదల చేస్తున్నామని ఆయన తెలిపారు. తెలుగునాట ఎన్టీఆర్ స్మృతి చిరస్థాయిగా ఉండటానికి హైదరాబాద్‌లో ఆయన 100 అడుగుల విగ్రహం ఏర్పాటు చేసి అక్కడ ఆయనకు సంబంధించిన విశేషాలతో డిజిటల్ మ్యూజియం కూడా ఏర్పాటు చేయాలని నిర్ణయించామన్నారు. విగ్రహం ఏర్పాటుకు స్థలం కేటాయించాలని తెలంగాణ ప్రభుత్వాన్ని కోరామని జనార్దన్ చెప్పారు.

సుబ్రహ్మణ్య స్వామిని దర్శించికున్న హైకోర్టు జడ్జి

తెనాలి రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జగద్గురు ఆది శంకరాచార్య సహిత శ్రీ అభయ హస్త శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారిని హైకోర్ట్ జడ్జి జస్టిస్ వి.శ్రీనివాస్ శుక్రవారం దర్శించుకున్నారు. మండలంలోని పెదరావూరు సుబ్రహ్మణ్యపురంలో కొలువుదీరి ఉన్న సుబ్రహ్మణ్యస్వామి వారి చతుర్థ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయాన్ని సందర్శించి స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారి దర్శనానికి విచ్చేసిన న్యాయమూర్తికి ఆలయ మర్యాదలతో అధికారులు స్వాగతం పలికారు. స్వామి వారి దర్శనం అనంతరం వేద ఆశీస్సులు అందించారు. డీఎస్పీ జనార్దన్‌రావు, సీఐ బెల్లం శ్రీనివాసరావు, ఎస్ఐ ప్రతాప్‌కుమార్ ఉన్నారు.

మహానటి సావిత్రి గొప్ప మానవతా వాది


సావిత్రి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, గ్రామస్తులు

రేపల్లె, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మహానటి సావిత్రి గొప్ప నటియే కాదు మానవతా వాది అని తోటివారికి సహాయం అందించటంలో ముందుండే వారని యూఎస్ఏకు చెందిన కోటా సుబ్రహ్మణ్యం అన్నారు. శుక్రవారం రేపల్లె మండలం వడ్డివారిపాలెంలోని శ్రీమతి సావిత్రిగణేష్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సావిత్రి 88వ జయంతిని పురస్కరించుకుని ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులతో సరదాగా గడిపారు. వారి విద్యాభ్యాసం, చదువులో ఎలా రాణిస్తున్నారనే అంశంపై అడిగి తెలుసుకున్నారు. చదువుతోపాటు కళా, క్రీడా రంగాలపై కూడా ఆసక్తి పెంచుకోవాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులను పాఠశాలకు తీసుకువచ్చే బస్సు రవాణా నిమిత్తం నెలకు రూ.70వేలు చొప్పున రెండేళ్ల రవాణా ఖర్చులు తాను చెల్లిస్తానని సుబ్రహ్మణ్యం హామీ ఇచ్చారు. అనంతరం గ్రామస్తులు, ఉపాధ్యాయులు కోటా సుబ్రహ్మణ్యాన్ని దుశ్శాలువా, పూలమాలలతో సత్కరించి మెమోంటోను అందించారు. గ్రామ సర్పంచి వడ్డి లక్ష్మీజీ, పాఠశాల హెచ్‌ఎం డి.మాధవి, పీఎంసీ ఛైర్మన్ జి.రామకృష్ణ, గ్రామ పెద్దలు వడ్డి హనుమంతరావు, తులం రమణ, పాలంకి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న బస్సు

●ఒకరు మృతి.. ఆరుగురికి గాయాలు


సుబ్బయ్యపాలెం వద్ద లారీని ఢీకొన్న బస్సు

రొంపిచర్ల, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని సుబ్బయ్యపాలెం వద్ద శుక్రవారం తెల్లవారుజామున ఆగి ఉన్న లారీని బస్సు ఢీకొన్న సంఘటనలో ఒకరు మృతి చెందగా, ఆరుగురికి గాయాలైయ్యాయి. సేకరించిన వివరాల మేరకు.. హైదరాబాద్ వైపు నుంచి కందుకూరు వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు సుబ్బయ్యపాలెం సమీపంలో ఆగి ఉన్న లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, ఆరుగురికి గాయాలైయ్యాయి. నెల్లూరు జిల్లా లింగసముద్రం మండలం పెద్దపవని గ్రామానికి చెందిన కూటకోలు దుర్గమ్మ(56) అక్కడికక్కడే మృతి చెందారు. బస్సు ముందు భాగం నుజ్జునుజ్జయింది. బస్సులో సుమారు 60 మంది ప్రయాణికులు ఉన్నారు. ఆరుగురికి గాయాలు అవ్వగా నరసరావుపేటలోని ప్రభుత్వ, ప్రైవేట్ వైద్యశాలలకు తరలించారు. ప్రమాద విషయాన్ని తెలుసుకున్న రూరల్ సీఐ రామకృష్ణ, ఎస్ఐ అశోక్ సంఘటనా స్థలానికి చేరుకొని పొక్లెయినర్ సాయంతో బస్సును పక్కకు తీసి మృతదేహాన్ని బయటకు తీశారు. ప్రయాణికులను సురక్షితంగా కిందకుదించారు. డ్రైవర్ అజాగ్రత్త వల్లే ప్రమాదం జరిగినట్టు తెలిసింది. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు. విషయం తెలుసుకున్న ఎస్పీ కంచి శ్రీనివాసరావు సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాద వివరాలు తెలుసుకున్నారు.

పులిచింతల ప్రాజెక్టును సందర్శించిన జిల్లా ఎస్పీ


ప్రాజెక్టు ఇంజనీర్లతో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు

అచ్చంపేట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టును పల్నాడు జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు శుక్రవారం సందర్శించారు. ప్రాజెక్టు ఇంజనీర్లతో, సిబ్బందితో ప్రాజెక్టు వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అచ్చంపేట పోలీసు స్టేషన్‌ను సందర్శించి రికార్డులు పరిశీలించి సిబ్బంది పని తీరును తెలుసుకున్నారు. ఎస్పీతో పాటు అచ్చంపేట సీఐ వెంకట ప్రసాదు తదితరులు ఉన్నారు.

అక్రమ ఓడీల వ్యవహారంపై డీపీటీవో సీరియస్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

గుంటూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో వైసీపీ ప్రభుత్వ హయాంలో అడ్డగోలుగా మంజూరు చేసిన అవుట్ ఆఫ్ డిజిగ్నేషన్ (ఓడీ)ల వ్యవహారంపై జిల్లా ప్రజారవాణాధికారి (డీపీటీవో) ఎమ్.రవికాంత్ సీరియస్ అయ్యారు. విభజిత జిల్లాలో అనర్హులకు అక్రమంగా ఓడీలు మంజూరు చేయటంపై 'ఓడీతో ఎంజాయ్' శీర్షికన 'ఆంధ్రజ్యోతి' జిల్లా సంచికలో శుక్రవారం ప్రచురితమైన కథనం ఆర్టీసీ వర్గాల్లో కలకలం రేకెత్తించింది. కథనంపై స్పందించిన డీపీటీవో డిపోల వారీగా ఓడీల జాబితాను సిద్ధం చేయాలని ఆదేశించినట్లు తెలిసింది. కాగా దీనిపై కొన్ని డిపోల్లో అధికారులు అక్రమ ఓడీల వ్యవహారంపై మల్లగుల్లాలు పడుతున్నారు. ఎవరెవరికి ఎందుకు ఓడీలు మంజూరు చేయాల్సి వచ్చింది వంటి అంశాలపై ఏం చెప్పాలో తెలియక నానా హైరానా పడుతున్నట్లు తెలిసింది. అయితే కథనంపై ఆర్టీసీ వైఎస్ఆర్ ఎంప్లాయిస్ యూనియన్ స్పందించింది. అక్రమ ఓడీల వ్యవహారంలో వైఎస్ఆర్ ఎంప్లాయిస్ యూనియన్‌కు సంబంధించిన సభ్యులు ఎవరూ లేరని యూనియన్ రీజనల్ అధ్యక్షుడు వైవీ రావు ఒక ప్రకటనలో తెలిపారు.

ఐసీఐసీఐ బ్యాంక్ కుంభకోణం కేసులో మరొకరు అరెస్టు

గుంటూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఐసీఐసీఐ బ్యాంకు కుంభకోణం కేసులో మరో నిందితుడిని సీఐడీ అధికారులు అరెస్టు చేశారు. ఈ కేసులో ఎనిమిదో నిందితునిగా ఉన్న చిలకలూరిపేటకు చెందిన కొర్నెపాటి ప్రభు శేఖర్ (ఎ8)ను శుక్రవారం సీఐడీ అధికారులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచగా రిమాండ్ విధించడంతో జైలుకు తరలించారు. కేసులో ప్రధాన నిందితుడైన దూడ నరేష్ చంద్రశేఖర్ పరారీలో ఉన్నారు. ఆయన కోసం ఇప్పటికే సీఐడీ బృందాలు కర్ణాటక, కేరళ రాష్ట్రాల్లో జల్లెడ పట్టాయి. చంద్రశేఖర్ చిలకలూరిపేట, నరసరావుపేట, విజయవాడలోని భారత్ నగర్ బ్రాంచ్‌లలో మేనేజర్‌గా పనిచేసిన సమయంలో పెద్ద ఎత్తున ఖాతాదారులకు సంబంధించిన బంగారు ఆభరణాలను అపహరించి వేరే బ్యాంకులలో తాకట్టు పెట్టుకోవడం, అదేవిధంగా వారి పేర్లతో రుణాలు తీసుకోవడం వంటి నేరాలకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. తద్వారా సుమారు రూ. 150 కోట్లకు పైగా కొల్లగొట్టినట్లు ప్రాథమికంగా ఇప్పటికే అధికారులు నిర్ధారణకు వచ్చారు. గతంలో ఓ ప్రైవేట్ బ్యాంకులో పనిచేసిన సమయంలో ప్రభుశేఖర్‌కు చంద్రశేఖర్ పరిచయం అయ్యాడు. ఆయా బ్రాంచీలలో కొల్లగొట్టిన డబ్బులతో ప్రభుశేఖర్, ఆయన తమ్ముడు, తల్లి పేర్లతో బ్యాంకు ఖాతాలు తెరిచి వారి పేర్లతో వివిధ కంపెనీలు స్థాపించి వ్యాపార కార్యకలాపాలు సాగించినట్లు గుర్తించారు. ఇప్పటికే అరెస్టు అయిన అన్నం హరీష్ పేరుతో పెద్ద ఎత్తున బ్యాంకులలో బంగారం తాకట్టు పెట్టడం, అదేవిధంగా లాకర్లలో దాచడం వంటి కార్యకలాపాలకు పాల్పడినట్లు విచారణలో గుర్తించిన అధికారులు ఆయా ఖాతాలు సీజ్ చేసేందుకు ఇప్పటికే సంబంధిత బ్యాంకులకు లెటర్లు కూడా పంపారు. ఈ కేసులో ఇప్పటి వరకు సీఐడీ అధికారులు సుమారు 15 మందిని నిందితులుగా గుర్తించారు. అయితే కేసులో ప్రధాన నిందితుడైన మేనేజర్ నరేష్ చంద్రశేఖర్ పట్టుబడితే గాని కేసు కొలిక్కి వచ్చే అవకాశం ఉంది.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాల్సిందే

● పిటీషన్‌లో పేర్కొన్న సీసీఐ మాజీ మేనేజర్ సాయి ఆదిత్య

గుంటూరు సిటీ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సీసీఐ అధికారులు, బయ్యర్లు, వ్యాపారులకు పెనుసవాల్ ఎదురైయింది. సీసీఐ మాజీ మేనేజర్ గోగినేని సాయి ఆదిత్య కమల్ దేవ్ రాష్ట్ర ప్రభుత్వానికి చేసిన ఫిర్యాదు చర్చనీయాంశంగా మారింది. ఈ నెల 2న అదే విషయాలను ప్రస్తావిస్తూ హైకోర్టులో కేసు వేశారు. జాయింట్ కలెక్టర్ నోటిపై చేసిన తర్వాత సీసీఐ కేంద్రాలు బహిరంగ ప్రదేశాలుగా పరిగణించాల్సి ఉంటుందని పిటీషన్‌లో పేర్కొన్నట్లు తెలిసింది. బహిరంగ ప్రదేశాల్లో ఆంధ్రప్రదేశ్ ప్రజా భద్రతా చట్టం-2013ను అనుసరించి సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ప్రభుత్వానికి సాయి ఆదిత్య పంపిన పిటీషన్‌పై గుంటూరు జిల్లా కలెక్టర్ విచారణ జరిపి సమాధానం ఇచ్చారు. సీసీఐ కేంద్రాల్లో ఎనలిటికల్ టూల్స్‌తో కూడిన సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. తీరా సీసీఐ కేంద్రాలు ఏర్పాటు చేసిన తర్వాత సీసీ కెమెరాలు ఏర్పాటు చేయలేదన్నది మాజీ మేనేజర్ సాయి ఆదిత్య వాదన. ఈ నేపథ్యంలో ఆయన హైకోర్టును ఆశ్రయించారు. మార్కెటింగ్ శాఖ చెప్పినట్లు మిల్లుల యజమానులు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు కాకుండా ప్రభుత్వం తరఫున ఏర్పాటు చేయాలని పిటీషన్ వేశారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.20 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	96,104,115
చికెన్ విత్ స్కిన్	184.00
చికెన్ స్కిన్ లెస్	194.00

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు

బాలికల వసతి గృహం వార్డెన్‌గా సుమణి

సత్తెనపల్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఎస్సీ కళాశాలల బాలికల సాంఘిక సంక్షేమ వసతి గృహ అధికారిణిగా పీ.సుమణి బాధ్యతలు చేపట్టారు. ఆమె మాచర్ల నుంచి బదిలీపై సత్తెనపల్లి వచ్చారు. ఆమె శుక్రవారం ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణను మర్యాద పూర్వకంగా కలసి బొకేను అందించారు. ఈ సందర్భంగా కన్నా మాట్లాడుతూ వసతి గృహంలో ఉన్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని, విద్యార్థులకు మెనూ ప్రకారం ఆహార పదార్థాలను అందించాలని, విద్యార్థినుల విద్యాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు.

విశ్వబ్రాహ్మణ కాలనీలో చైర్మన్ నరసింహారావు పర్యటన

మాచర్లటౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): 'గుడ్ మార్నింగ్' కార్యక్రమంలో భాగంగా స్థానిక విశ్వబ్రాహ్మణ కాలనీలో శుక్రవారం మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు పర్యటించారు. వార్డులోని వసతులను పరిశీలించారు. అక్కడి సమస్యల గురించి అడిగి అడిగి తెలుసుకున్నారు. అలాగే, మున్సిపల్ క్వారీలో నీటి శుభ్రతను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ శ్రీనివాసరావు, కౌన్సిలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

మురుగునీటి నిల్వతో అంటురోగాలు

ముప్పాళ్ళ డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): గ్రామాలలో మురుగు కాల్వలలో మురుగునీటి నిల్వ ఉండటం వలన దోమలు వ్యాప్తి చెంది అంటురోగాలు ప్రబలుతాయని జిల్లా వైద్యశాఖాధికారి డాక్టర్ బి.రవి అన్నారు. ముప్పాళ్ళ ఎస్సీ కాలనీలోని సైడుకాల్వలలో నిలిచిన మురుగు నీటిని పరిశీలించి నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. మంచినీటి బావులలో వేసిన మోటార్ల పైపులను మురుగు కాల్వలలో వేసి ఉండటం చూసి నీరు కలుషితమై అంటురోగాలు ప్రబలే అవకాశం ఉందన్నారు. బోరు నీటిని సేకరించి టెస్టింగుకు పంపించాలని అన్నారు. ఆయన వెంట డాక్టర్ జయకృష్ణ, హెల్త్ సూపర్‌వైజర్లు పీటర్ డామియెన్, జోస్పిన్‌రాణి, ఏఎన్ఎంలు ఉన్నారు.

విద్యుత్ తయారీపై విద్యార్థులకు అవగాహన

రెంటచింతల,డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రతి వ్యవస్థ పని చేసే విధానానికి విద్యుత్ మూలమని టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టు ఏఈ మల్లేష్ అన్నారు. జెట్టిపాలెం మోడల్ స్కూల్ విద్యార్థులు శుక్రవారం మెయిన్ గేట్ నుంచి ర్యాలీగా ఎంసీఆర్(మెయిన్ కంట్రోల్ రూమ్) దగ్గరకు తరలి వచ్చారు. రెండు టర్బైన్ల ద్వారా విద్యుత్ ఎలా తయారవుతుంది? తయారైన నీటిని ఎక్కడకు పంపుతున్నారు? ఉత్పత్తి అయిన విద్యుత్‌ను పశర్లపాడు సబ్ స్టేషన్‌కు ఏ విధంగా అనుసంధానం చేస్తారనే అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఈ శ్రీనివాసాచారి, ప్రిన్సిపాల్ కే పాపారావు, ఐటీ అండ్ ఐటీ ఈఎస్ వృత్తి విద్య జిల్లా సమన్వయ కర్త అయ్యప్ప స్వామి,వెంకట్రామయ్య, వీ.స్వప్న, రేణుకాదేవి, శ్రీను, వెంకి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదు కార్యకర్తలకు అండ : కన్నా

సత్తెనపల్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ సభ్యత్వ నమోదు కార్యకర్తలకు అండ అని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. టీడీపీ ప్రజా వేదికలో శుక్రవారం రాత్రి పలువురు మహిళలు కన్నా చేతుల మీదుగా టీడీపీ సభ్యత్వాన్ని స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ. రూ100తో సభ్యత్వం తీసుకుంటే రూ.5 లక్షల వరకు ప్రమాద బీమా, కుటుంబ సభ్యులకు విద్య, ఉద్యోగ, వైద్య సాయం అందుతుందన్నారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నేతలు పాల్గొన్నారు.

సావిత్రికి నివాళులు

సత్తెనపల్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఎన్‌టీఆర్ కళా క్షేత్రంలో శుక్రవారం మహానటి సావిత్రి జయంతిని ఆమె అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కంఠమనేని వెంకటేశ్వరరావు, జీ.వెంకటరావు, ఇర్మియ, కంభాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జేబు దొంగల హల్‌చల్

సత్తెనపల్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని రఘురామ్‌నగర్‌లో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ కార్యాలయం వద్ద జేబు దొంగలు హల్‌చల్ చేశారు. టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు తాతా జయ ప్రకాష్ నారాయణ జేబులో ఉన్న రూ.5 వేల నగదు, మరో టీడీపీ నేత దరువూరి నాగేశ్వరరావు జేబులో ఉన్న రూ.25 వేల నగదును దొంగలు దొంగిలించుకు వెళ్ళారు. వెంటనే వారిరువురు అక్కడ ఉన్న పోలీసులకు సమాచారాన్ని అందించారు. దీనిపై విచారణ జరుపుతున్నట్టు పట్టణ సీఐ బ్రహ్మయ్య తెలిపారు.

కాపర్ వైరు చోరీ

గురజాలటౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో కాపర్ వైరు చోరీ జరిగిన సంఘటన మండలంలోని జంగమహేశ్వపురంలో గురువారం రాత్రి జరిగింది. గ్రామానికి చెందిన కొంటం వెంకటేశ్వరరెడ్డి శుక్రవారం ఉదయం తన పొలానికి వెళ్లగా ట్రాన్స్‌ఫార్మర్ను కింద పడవేసి ఉండటం, కాపర్‌వైరు చోరీకి గురైనట్లు గుర్తించారు. ఈ విషయంపై విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించారు. రూ. 15 వేల విలువైన కాపర్‌వైరు చోరీకి గురైనట్లు బాధితుడు వెంకటరెడ్డి తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు గురజాల పోలీసులు కేసు నమోదు చేశారు.

మిరప రైతులకు శిక్షణ

పిడుగురాళ్ల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జూలకల్లులో ఉద్యాన శాఖ, సెంట్రల్ ఆఫ్ ఎక్సలెన్స్ గుళ్లపల్లి తరుపున మిరప రైతులకు పంట సాగు, సమగ్ర పోషక, సస్యరక్షణ పద్ధతులపై శుక్రవారం శిక్షణ కార్యక్రమం జరిగింది. జిల్లా ఉద్యాన శాఖ అధికారి అశోక్‌రెడ్డి, ఉద్యాన పరిశోధన లాంఫామ్ శాస్త్రవేత్త జి.క్రాంతిరేఖ, పిడుగురాళ్ల ఉద్యాన శాఖ అధికారి వై.మోహన్ మిరప సాగులో ఆధునిక పద్ధతులు పాటించడం ద్వారా అధిక దిగుబడి సాధించేందుకు రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిజిటల్ గ్రీన్ సంస్థ ప్రతినిధి మస్తాన్, వాల్యూ ఆయిల్ కంపెనీ ప్రతినిధి నవీన్, పెద్దలు వెంకటేశ్వరరెడ్డి, సాంబశివరావు, కొండలు, సాంబయ్య, ఉద్యాన శాఖ అధికారి దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.



జానపాడులో జరిగిన రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు



నరమాలపాడులో రైతుల సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే బ్రహ్మనందరెడ్డి

ప్రతి రైతు సమస్యకు పరిష్కారం

- కూటమి ప్రభుత్వంలో చంద్రబాబు నిర్ణయం
- ఎమ్మెల్యే యరపతినేని, ఎమ్మెల్సీ జంగా

పిడుగురాళ్ల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో రైతుల భూములను అన్యాయంగా ఆక్రమించుకోవడం, రెవెన్యూ రికార్డులో పేర్లను తారుమారు చేయడం పెద్దఎత్తున జరిగాయని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం సాయంత్రం జానపాడు గ్రామంలో రెవెన్యూ సదస్సును ఎమ్మెల్యే యరపతినేని ప్రారంభించారు. యరపతినేని మాట్లాడుతూ వైసీపీ పాలనలో భూములు లాక్కోవడం మినహా రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ఏనాడు సదస్సులు పెట్టిన పాపాన పోలేదని తెలిపారు. రేషన్‌కార్డులు, పింఛన్లు కొత్తవి కొద్దిరోజులలో దరఖాస్తు చేసుకోవాలని, అర్హులైన సొంత ఇల్లు లేని వారు కూడా 15వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఎంఎల్‌సి జంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ రాష్ట్రంలో రైతాంగ సమస్యలను పరిష్కరించే దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్ని గ్రామాలలో రెవెన్యూ సదస్సులను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మురళీకృష్ణ, తహసీల్దార్ మధుబాబు, డాక్టర్ వున్నం నాగమల్లికార్జునరావు, వడ్డవల్లి సర్వేశ్వరరావు, గండికోట వెంకటేశ్వర్లు, చింతలపూడి రామ్మూర్తి, కూరపాటి కొండలు, వున్నం సురేష్, ముప్పాళ్ల సాంబయ్య, వున్నం వెంకట్రావు, పాల శ్రీను, ముప్పాళ్ల రమేష్, కోట శ్రీను, యడ్లపల్లి నారాయణ, శివ, జోగయ్య, జనసేన నేతలు నరసింహారావు, రామకృష్ణ, సర్పంచ్ మర్యాదరావు, వి.వెంకటేశ్వర్లు, మౌలాలి, ఖాశిం, బండ్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

● సత్తెనపల్లి రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెద మక్కెనలో శుక్రవారం రెవెన్యూ గ్రామ సభ జరిగింది. గ్రామ సభలో పట్టా దారు పాసు పుస్తకం కొరకు రెండు, అడంగల్‌లో విస్తీర్ణం, నమోదు కొరకు రెండు, సర్వే కొలత కొరకు ఒక అర్జీ, మొత్తం ఐదు అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ కేఎస్ చక్రవర్తి తెలిపారు. గ్రామ సభలో రెవెన్యూ అధికారులతో పాటు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

● కారంపూడి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రైతుల భూ సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు శాసనసభ్యుడు జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. మండలంలోని నరమాలపాడులో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందన్నారు. రైతులు తమ భూములకు సంబంధించిన సమస్యల పరిష్కారం కోరుతూ అర్జీలు అందించాలన్నారు. అనంతరం రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే, వారి అర్జీలను స్వీకరించారు. ముందుగా అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పుల్లారావు, టీడీపీ నాయకులు పంగులూరి అంజయ్య, పుల్లయ్య, ఉన్నం లక్ష్మీనారాయణ, మునుగోటి సత్యం, చప్పిడి రాము, గోళ్ల సురేష్ యాదవ్, బొల్లేడి శ్రీనివాసరావు, కటికల బాలకృష్ణ, తండా మస్తాన్‌జాని, బీజేపీ నేతలు శెట్టి హనుమంతురావు, గోరంట్ల నాగేశ్వరరావు, తెలుగు యువత నేత తుపాకుల రత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

● దుర్గి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): భూ వివాదాలు లేని రాష్ట్రంగా తీర్చదిద్దడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని శాసనసభ్యుడు జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. మండలంలోని అడిగొప్పులలో జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొన్నారు. భూ సమస్యలకు సంబంధించి 11 అర్జీలు అందాయి. ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసీపీ హయాంలో ఆ పార్టీ నేతలు ప్రభుత్వ, రైతుల భూములను దోచుకున్నారని ఆరోపించారు. రైతుల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మురళీకృష్ణ, తహసీల్దార్ ఫణీంద్రకుమార్, ఎంపీపీ సునీతా శంకర్, ఎంపీడీవో శివప్రసాద్, యాగంటి వెంకటేశ్వర్లు, నరేష్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

● దాచేపల్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో ప్రభుత్వ భూములు, డికె పట్టాలతో వున్న భూములను వైసీపీ నేతలు చేసిన కబ్జాలు, ఆన్‌లైన్‌లో నమోదుపై అధికారులకు తంగెడ గ్రామస్తులు ఫిర్యాదులు అందజేశారు. తంగెడ గ్రామంలో దాచేపల్లి తహసీల్దార్ వైవి కుటుంబరావు అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ప్రభుత్వ భూములు, దేవాలయ భూములు, మాణ్యాల భూములకు కూడా ఆన్‌లైన్‌లో మార్పులు చేర్పులు జరిగినట్లుగా ఫిర్యాదులు రావడం జరిగిందని అధికారులు అన్నారు. ఈ విషయంపై పూర్తిస్థాయి విచారణ జరిపి ఉన్నతాధికారులకు నివేదిక అందజేయనున్నట్లు సదస్సులో గ్రామస్థులకు అధికారులు హామీ ఇచ్చారు.

● మాచవరం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని శ్రీ రుక్మిణీపురంలో శుక్రవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సదస్సులో మొత్తం ఐదు అర్జీలు వచ్చినట్టు తహసీల్దార్ క్షమారాణి తెలిపారు. ఐదు అర్జీలు కూడా వెబ్ ల్యాండ్ నమోదు కొరకు వచ్చినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ కోటేశ్వరరావు, మండల సర్వేయర్ సాల్మన్ రాజు, వీఆర్వో లోకేశ్, గ్రామ టీడీపీ నాయకులు రాధాకృష్ణ పాల్గొన్నారు.

● అమరావతి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని వైకుంఠపురం గ్రామంలో రైతులు ఇనాం భూముల పేరుతో తమ పూర్వీకుల నుంచి అనుభవిస్తున్న భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించి తమకు న్యాయం చేయాలని శుక్రవారం గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ నాగమల్లేశ్వరరావుకు వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వం స్పందించి తమకు న్యాయం చేయాలని సుమారు 250 మంది బాధిత రైతులు కోరుతున్నారు. సదస్సులో ప్రజల నుంచి 23 అర్జీలు వచ్చాయి.

● అచ్చంపేట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మాదిపాడు గ్రామంలో శుక్రవారం రెవెన్యూ సదస్సులు ప్రారంభ మైనట్టు తహసీల్దార్ శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు. రెవెన్యూ సదస్సులో 500 దరఖాస్తులు రాగా 18 దరఖాస్తులను అక్కడికక్కడే పరిష్కరించారు. మరో 32 దరఖాస్తులు పరిష్కరిస్తామని తహసీల్దార్ తెలిపారు. ఈ రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ శ్రీనివాస్‌తో పాటు క్రోసూరు ఏడీఏ హనుమంతరావు, వీఆర్వో తదితర సిబ్బంది పాల్గొన్నారు.

● నకరికల్లు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : భూములకు సంబంధించిన అన్ని సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్టు మండల ప్రత్యేక అధికారి, డీఆర్‌డీఏ పీడీ బాలూ నాయక్ తెలిపారు. చాగల్లు, కండ్లకుంట గ్రామాల్లో శుక్రవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. భూ సమస్యలకు సంబంధించి 35 దరఖాస్తులు అందినట్టు డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ పురుషోత్తం, వీఆర్వో బీరాలు పాల్గొన్నారు.

● గురజాలటౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొట్టిముక్కల సచివాలయంలో తహసీల్దార్ నగేష్ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతుల నుంచి 12 అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రైతుల భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందన్నారు. ముందుగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● రెంటచింతల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని అర్జీలన్నింటికి జవాబుదారీతనంగా ఉండడానికే సదస్సులను ఏర్పాటు చేస్తున్నామని మండల నోడల్ అధికారి ఎం.వెంకటరమణ అన్నారు. మండలంలోని మల్లవరంలో నిర్వహించిన రెవిన్యూ సదస్సులో 9 అర్జీలు వచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డీటీ బ్రహ్మయ్య,ఆర్ఐ పల్లా రామకృష్ణ,వీఆర్వో పాపారావు పాల్గొన్నారు.

● బెల్లంకొండ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ జేమున్నీసాబేగం అన్నారు. మండలంలోని నాగిరెడ్డిపాలెం గ్రామంలో శుక్రవారం రెవెన్యూ సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సదస్సులో రైతుల నుంచి ఎనిమిది అర్జీలు వచ్చినట్టు తహసీల్దార్ పేర్కొన్నారు. ఈ అర్జీలను పరిశీలించి త్వరిత గతిన సమస్య పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ అన్నారు. ఈ సమావేశంలో మండల టీడీపీ కోర్ కమిటీ సభ్యులు వెన్నా సీతారామిరెడ్డి, వెన్నా వెంకటరెడ్డి, తిప్పిరెడ్డి పిచ్చారెడ్డి, వీఆర్వో వెంకయ్య, టీడీపీ నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

● వెల్దుర్తి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రైతులు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ బాషా అన్నారు. మండల కేంద్రమైన వెల్దుర్తిలో శుక్రవారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొన్నారు. రైతుల వద్ద నుంచి 17 అర్జీలు అంది నట్లు చెప్పారు. 22ఏ చుక్కల భూములు, పాసుపుస్తకాల కోసం అర్జీలు అందాయన్నారు. సదస్సులో వీఆర్వో మల్లికార్జునరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

రాజ్యాంగంలో అన్ని వర్గాలకు సమాన హక్కులు

- రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి రవికుమార్
- అంబేద్కర్‌కు ఘన నివాళి

సత్తెనపల్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : అన్ని వర్గాల ప్రజలకు రాజ్యాంగంలో సమాన హక్కులు కల్పించిన ఘనత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌దేనని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ అన్నారు. ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ కార్యాలయంలో శుక్రవారం భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్ధంతిని నిర్వహించారు. అంబేద్కర్ చిత్రపటానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ దేశానికి అంబేద్కర్ ఆదర్శప్రాయుడన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, కలెక్టర్ అరుణ్ బాబు, ఎస్పీ కే.శ్రీనివాసరావు, రాష్ట్ర నాయకులు ఎలినేడి రామస్వామి, నాగోతు శౌరయ్య తాతా జయ ప్రకాష్ నారాయణ, మన్నెం శివ నాగమల్లేశ్వరరావు, అంకాళ్ళ ప్రభుదాసు, బండారు నాగరాజు, ఆర్డీవో రమణకాంత్‌రెడ్డి, పలువురు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. కాగా పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో కూడా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చిట్టా విజయ భాస్కర్‌రెడ్డి, పలువురు వైసీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పట్టణ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు దాసరి జ్ఞాన్‌రాజ్‌పాల్ ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్ధంతిని నిర్వహించారు.

పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో అంబేద్కర్ విగ్రహాలకు నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మాదంశెట్టి వేదాద్రి, కొత్త లక్ష్మయ్య, పాల్‌రాజ్, మోహన్‌రావు, ఆనంద్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. కాగా మాల మహానాడు ఆధ్వర్యంలో కూడా అంబేద్కర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్ర మంలో ఎం.పద్మారావు, కేజాన్ బాబు, మృత్యుంజ యరావు, కోడిరెక్క దేవదాసు తదితరులు పాల్గొన్నారు.

● అమరావతి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి) : ప్రపంచ దేశాల రాజ్యాంగాలన్నింటిలో కెల్లా భారత రాజ్యాంగం ఔన్నత్యం కలిగి ఉండటానికి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చేసిన కృషి అభినందనీయం అని పెదకూరపాడు నియోజకవర్గ శాసనసభ్యులు భాష్యం ప్రవీణ్ అన్నారు. అంబేద్కర్ వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం గుంటూరులోని తన కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళుల ర్పించారు. విద్య ద్వారానే అసమానతలు, మూఢనమ్మకాలు తొలుగుతాయని నిరూపించిన మహానుభావుడు అంబేద్కర్ అని కొనియాడారు. టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

● అమరావతి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేద్కర్ వర్ధంతిని స్థానిక శ్రీరామకృష్ణ హిందూ హైస్కూల్‌లో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి సీఐ ఎం.శ్రీనివాసరావు, ఎస్ఐ రాజశేఖర్ ముఖ్యఅతిథులుగా పాల్గొని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఎం.రామాంజనేయులు, బోధన సిబ్బంది, అంబేద్కర్ ఆలోచనా వేదిక కన్వీనర్ టి.రఘు, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రి గొట్టిపాటి రవి కుమార్, ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ



గుంటూరులోని తన కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

● క్రోసూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ వర్ధంతిని శుక్రవారం క్రోసూరులో ఘనంగా నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి తెలుగుదేశం పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ కాంద్రు కాశయ్య, టీడీపీ నాయకులు గుడిపాడు బాషా, దుద్దుల యోహాన్, బొల్లేపల్లి రోశయ్య, అనుముల వెంకట రామిరెడ్డి, అనుమాల పూర్ణ పాల్గొన్నారు. మండలంలోని పెరికపాడు ఎమ్మార్పీఎస్ నాయకుడు జడ సుబ్బు ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మురికపూడి ఇజ్రాయేలు, ముత్యాల పౌలు, దిలీప్ కుమార్ పాల్గొన్నారు.

● అచ్చంపేట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : అచ్చంపేటలోని మండల పరిషత్ కార్యాలయం వద్ద టీడీపీ ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేద్కర్ వర్ధంతిని శుక్రవారం ఘనంగా జరిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం, పాటిబండ్ల బాపిరాజు, వెనిగండ్ల కోటయ్య తిరువాయిపాటి ఆంజనేయులు, పొన్నెకంటి రవి, కోటా చంటి, సామేలు తదితరులు పాల్గొన్నారు. అంబేద్కర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్ట్ చైర్మన్ చిలుకా చంద్రయ్య అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయుడు అనీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. వైసీపీ ఆధ్వర్యంలో అంబేద్కర్ వర్ధంతి నిర్వహించారు.

● పిడుగురాళ్ల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అంబేద్కర్ వర్ధంతిని పురస్కరించుకొని స్థానిక అంబేద్కర్ విగ్రహానికి దళిత సంఘాలు, ఎంఆర్‌పిఎస్ నేతలు, మాల మహానాడు నేతలు నివాళులర్పించారు. పోలీస్‌స్టేష న్ సెంటర్‌లోని విగ్రహానికి, ఐలాండ్ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి సీఐ వెంకట్రావు, పాశం శ్యామ్, దర్శి శ్యామ్, గారపాటి సంగీతరావు, హెడ్ కానిస్టేబుల్ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

● దాచేపల్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): దాచేపల్లిలో అంబేద్కర్ విగ్రహానికి వివిధ పార్టీల నాయకులు, ప్రజాసంఘాల నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా ఆయన చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు.

● మాచవరం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మాచవరం సచివాలయంలో, బస్టాండ్ సెంటర్‌లో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్ధంతిని నిర్వహించారు. అంబేద్కర్ చిత్రపటానికి, విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కోటేశ్వరరావు, ఎంపీటీసీ మద్దు కృష్ణ, సర్పంచ్ రాగిడి నరేష్, మద్దు కోటేశ్వరరావు, సచివాలయ సిబ్బంది, రాగిడి కిషోర్, కాసులు, శివ తదితరులు పాల్గొన్నారు.

● నకరికల్లు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలని చేజర్ల జడ్పీ హైస్కూల్ హెచ్ఎం షేక్ ఫాహిన్ అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ షేక్ హసన్, జీ.మోహనరావు, ఎస్.లలిత, పీ.మాలిక, సీహెచ్ వెంకటేశ్వర్లు, మస్తాన్‌వలి, వెంకటరావు, సుందరరావు, గౌస్ పాల్గొన్నారు.

● మాచర్ల టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 68వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం దళిత బహుజన భీమ్ సేన, డప్పు జానపద కళాకారుల సంఘం, దళితుల బహుజన సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. స్థానిక పార్కు సెంటరులోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వేణుబాబు, ఎస్ఐ సంధ్యారాణి, పేరుపోగు జార్జి, కుక్కమూడి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఓబీసీ మహిళా మండలి జిల్లా అధ్యక్షురాలు గంజర్ల లక్ష్మి ఆధ్వర్యంలో కూడా నివాళులర్పించారు.

● మాచర్ల రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విజయపురిసౌత్‌లో అంబేద్కర్ వర్ధంతి నిర్వహించారు. గ్రామంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పీటీజీ పాఠశాలలో ప్రిన్సిపాల్ శ్యామ్యూల్ జాన్ ఆధ్వర్యంలో అంబేద్కర్‌కు నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో టీడీపీ నేత బొల్లా వెంకటేశ్వర్లు చౌదరి, మాలమహానాడు అధ్యక్షుడు బొబ్బిలి చంద్రశేఖర్, గుంటి ఆంధ్రూస్‌బాబు, నాగేంద్రబాబు, సత్తిబాబు పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

- రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్



సచివాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి గొట్టిపాటి రవి కుమార్, పక్కన ఎమ్మెల్యే కన్నా

సత్తెనపల్లి రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీల అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. మండలంలోని ఫణిదం గ్రామంలో రూ.40 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనాన్ని మంత్రి రవికుమార్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పరిపాలిస్తుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ కూటమి ప్రభుత్వం ముందుకు వెళ్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రితో పాటు ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, మన్నెం శివనాగమల్లేశ్వరరావు, ఫణిదం గ్రామ మాజీ సర్పంచ్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి గొట్టిపాటి

ముప్పాళ్ళ డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ముప్పాళ్ళ మండలంలో 1 కోటి 70 లక్షల రూపాయల అభివృద్ధి పనులకు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ శుక్రవారం శంకుస్థాపన చేశారు. ముప్పాళ్ళలో రూ.50 లక్షలతో నిర్మించనున్న ప్రైమరీ హెల్త్ సెంటర్‌కి, గుంటూరు బ్రాంచ్ కెనాల్‌పై నిర్మించనున్న బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. వారి వెంట టీడీపీ మండల అధ్యక్షుడు బత్తుల నాగేశ్వరరావు, నాయకులు ఎస్.గోపాళరావు పలువురు, అధికారులు, మండల నాయకులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో నిలిచిన అభివృద్ధి : యరపతినేని



మురుగునీటి శుద్ధి కేంద్రం పనుల ప్రారంభ శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

పిడుగురాళ్ల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ఐదేళ్ల పాలనలో పల్నాడు ప్రాంతమే కాకుండా రాష్ట్రం కూడా అభివృద్ధిలో 20 ఏళ్ల వెనక్కి వెళ్లిందని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. పిడుగురాళ్లలో మురుగునీటి శుద్ధి కేంద్రం ఏర్పాటుకు శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే యరపతినేని మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం ఒక మంచి నిర్ణయం తీసుకోవడం, పిడుగురాళ్లలో మురుగునీటిని శుద్ధిచేసే రెండు కేంద్రాలను మంజూరు చేయడం శుభపరిణామమన్నారు. రాబోయే రోజుల్లో కృష్ణాజలాలు ప్రతి ఇంటికి అందించే విధంగా ఇప్పటికే వార్డుల్లో పైపులైన్లను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. పిడుగురాళ్లలో వాకింగ్ ట్రాక్, పార్కును అందుబాటులోకి తీసుకొస్తామని, అర్బన్, రూరల్‌లో హౌసింగ్ స్కీమ్ ద్వారా ఇల్లు కావలసిన ప్రతి ఒక్కరు 15వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కొత్త వెంకట సుబ్బారావు, పబ్లిక్ హెల్త్ ఎస్ఈ దాసరి శ్రీనివాసరావు, ఈఈ గడిపూడి వెంకటేశ్వర్లు, డిప్యూటీ ఈఈ ఆర్‌వి శ్రీనివాసరావు, ఏఈ భాగ్యరాజు, మున్సిపల్ కమిషనర్ పి.శ్రీధర్, డీఈ వి.శ్రీనివాసరావు, ఏఈ రాఘవేంద్ర, పార్టీ నాయకులు పాండురంగ శ్రీను, వడ్డవల్లి సర్వేశ్వరరావు, ఎల్‌విఆర్, జొన్నలగడ్డ శ్రీను, కామిశెట్టి రమేష్, మందా డేవిడ్, దూదేకుల ఖాశింసైదా, వడ్డవల్లి సాంబశివరావు పాల్గొన్నారు.

సత్రశాల రహదారి సర్వే పూర్తి

రెంటచింతల,డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పాలువాయి జంక్షన్ నుంచి సత్రశాల పుణ్యక్షేత్రానికి వెళ్ళే నూతన రహదారి ఏర్పాటు చేసే నిమిత్తం చేపట్టిన సర్వే పనులు శుక్రవారంతో పూర్తయినట్లు ఆర్‌అండ్‌బీ ఏఈఈ యూసఫ్ చెప్పారు. జంక్షన్ నుంచి సత్రశాల వరకు 11.294 కిలోమీటర్లు ఉండే ఈ రహదారి నిర్మాణం నిమిత్తం సీఆర్‌ఐఎఫ్ కింద రూ. 21.60 కోట్లు మంజూరయ్యాయి. ఈ క్రమంలో రెండు రోజుల పాటు సర్వే నిర్వహించి ఈఈ రాజానాయక్‌కు నివేదిక సమర్పించనున్నారు. పశర్లపాడు,జెట్టిపాలెం గ్రామాల్లో ప్రారంభం నుంచి ఊరు చివరి వరకు 1 కి.మీ మేర సీసీ రోడ్లు నిర్మించనున్నారు.

అమరావతిలో 'మీతో మేము' పై అవగాహన

అమరావతి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి) స్థానిక పోలీసు స్టేషన్‌లో 'మీతో మేము' కార్యక్రమంలో భాగంగా వర్టికల్ టీవీని పోలీసు స్టేషన్‌కు వచ్చిన వారికి సైబర్ క్రైమ్, ఉమెన్, నార్కోటిక్ డ్రగ్‌కు సంబంధించి అవగాహన కల్పించడానికి ఏర్పాటు చేశారు. ఎస్‌హెచ్ఓ ఎం.శ్రీనివాసరావు, ఎస్ఐ రాజశేఖర్ పాల్గొన్నారు.

బాలల అక్రమ రవాణాను అరికడదాం

మాచవరం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మాచవరంలోని లయోలా ప్రేమ నివాసంలో జీకే హైస్కూల్ విద్యార్థినులకు బాలల అక్రమ రవాణాను అరికట్టే విధానంపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జీకే హైస్కూల్ యాజమాన్యం ఆధ్వర్యంలో లయోలా ప్రేమ నివాస్ సిస్టర్స్, సాంఘిక సేవ కార్యకర్తలు, బాలల అక్రమ రవాణా పై సూచనలు, సలహాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లయోలా ప్రేమనివాస్ సిస్టర్ సింధియా, రంగారావు పాల్గొన్నారు.

అమ్మవారికి 15 కిలోల వెండి బహుకరణ

పిడుగురాళ్ల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారికి పట్టణానికి చెందిన పెరుమాళ్ల రాజేష్, లక్ష్మీవనజ దంపతులు 15 కేజీల వెండి ని బహుకరించారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షులు కొత్త రఘురామయ్య, ప్రధాన కార్యదర్శి మద్దాళి సుబ్బయ్య, తదితరులున్నారు.

విద్యుదాఘాతంతో మృతి

అచ్చంపేట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మాదిపాడు గ్రామానికి చెందిన దేశెట్టి రామారావు(45) తెలంగాణాలోని చింతలపాలెం మండలం నక్కలగూడెం గ్రామం వద్ద శుక్రవారం విద్యుదాఘాతంతో మృతి చెందాడు. తెలంగాణాలోని నక్కలగూడెం సమీపంలో 11 కేవీ వైర్లు అంటుకోవటంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య వెంకట్రావమ్మ, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు.



టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడు గుంజా గంగారావు శుక్రవారం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో స్వాతి ఆర్ట్ క్రియేషన్స్ 29వ గోల్డెన్ సిల్వర్ అవార్డు, సినీ విశిష్టత అవార్డును ఫౌండర్, చైర్మన్ గిరిరాజు నుంచి అందుకున్నారు. -బెల్లంకొండ.

పురుగుమందు తాగి వృద్ధుడు ఆత్మహత్య

అమరావతి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి) సత్తెనపల్లి మండలం భీమవరం గ్రామానికి చెందిన యర్రమనేని కోటేశ్వరరావు(62) గురువారం రాత్రి కృష్ణానది ఒడ్డున పురుగుమందు తాగి ఆత్యహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం ఉదయం వెలుగుచూసింది. పోలీసుల కథనం ప్రకారం కోటేశ్వరరావుకు భార్య మృతి చెందగా ముగ్గురు కుమార్తెలకు వివాహం చేశాడు. కొన్ని సంవత్సరాలుగా ఆయన ఫిట్స్ వ్యాధితో ఇబ్బందిపడుతున్నాడు. చికిత్స చేయించుకున్నప్పటికి తగ్గకపోవడంతో గురువారం ఇంటి నుంచి బయలు దేరి అమరావతి చేరుకుని పురుగుమందు, కూల్‌డ్రింక్ కొనుగోలు చేసి రెండు కలుపుకుని నదీతీరంలో తాగి మృతి చెందాడు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా పోలీసులు వచ్చి అతని వద్ద ఉన్న సెల్‌ఫోన్‌తో కుమార్తెలలకు ఫోన్ చేయగా వారు వచ్చి తమ తండ్రిగా గుర్తించారు. ఎస్ఐ రాజశేఖర్ కేసు నమోదు చేసి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

దటీజ్.. లోకేశ్..



ప్రజా దర్బార్‌కు హాజరైన బాధితులు



యువనేత మంత్రి నారా లోకేశ్ ప్రజల కష్టాలు వింటూ కన్నీళ్లు తుడుస్తూ.... ప్రజాసమస్యల పరిష్కారమే ఏకైక అజెండాగా ఏర్పాటు చేసిన ప్రజాదర్బార్ శుక్రవారంతో 50 రోజులు పూర్తి చేసుకుంది. కష్టమేదైనా మీ వెంట నేనున్నానంటూ... ప్రజాదర్బార్ తలుపుతట్టినవారికి అండగా నిలుస్తున్నారు. వైసీపీ పాలనలో సామాన్యులు పెద్దలు సైతం తామెదుర్కొన్న కష్టాలను మంత్రి లోకేశ్‌కు చెప్పుకునేందుకు వచ్చి సమస్యలను పరిష్కరించుకుంటున్నారు. ఆనాడు వైసీపీ పాలనలో తాడేపల్లి ప్యాలెస్‌కు చేరుకున్న బాధితులను నిర్ధాక్షిణ్యంగా బయటకు నెట్టి గేట్లు వేసిన పరిస్థితి. కానీ నేడు లోకేశ్ ఆప్యాయంగా అందరి సమస్యలు వింటూ అక్కడికక్కడే కొన్ని సమస్యలను పరిష్కరించిన తీరుతో అర్జీదారులు సంతోషం వ్యక్తం చేస్తూ దటీజ్ లోకేశ్ అంటూ వ్యాఖ్యానిస్తున్నారు.

- ప్రజాదర్బార్ దిగ్విజయంగా 50 రోజులు పూర్తి
- ఇప్పటివరకు వచ్చిన వినతులు 5810
- పూర్తిగా పరిష్కారం చూపినవి 4400
- గల్ఫ్ సమస్యలపై ప్రత్యేక చొరవ

తాడేపల్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): 50 రోజుల ప్రజాదర్బార్‌లో ఇప్పటి వరకు వచ్చిన వినతులు 5810 కాగా పరిష్కారమైన వినతులు 4400 లుగా ఉన్నాయి. 1410 విజ్ఞప్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇప్పటివరకు 75 శాతం సమస్యలు పరిష్కారమయ్యాయి. విజ్ఞప్తుల్లో 50శాతం వరకు రెవెన్యూ, హోం శాఖకు సంబంధించినవి కాగా తదుపరి వరుసలో మానవనరులు, ఆరోగ్యం, పంచాయితీ రాజ్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖకుసంబంధించిన వినతులు ఉన్నాయి. భూ వివాదాలకు సంబంధించి 1585విజ్ఞప్తులు అందగా 1170 సమస్యలు పరిష్కరించారు. 415 పెండింగ్‌లో ఉన్నాయి. హోంశాఖకు సంబంధించి 1276 విజ్ఞప్తులు రాగా 1158 సమస్యలు పరిష్కరించారు. 118 విజ్ఞప్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఉద్యోగాల కోసం 800 దరఖాస్తులు రాగా అర్హతలను బట్టి 347 మందికి త్వరలోనే ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించనున్నారు. పెన్షన్‌కోసం 350 దరఖాస్తులు రాగా ఆయా సమస్యలు కూడా త్వరలోనే పరిష్కారం చూపనున్నారు.

ప్రజాదర్బార్ ద్వారా పరిష్కరించిన పలు సమస్యలు



కొండపల్లికి చెందిన చుట్టుగుంట శ్రీనివాసరావు తన కుమార్తె మంగళగిరి రత్నాల చెరువులో ఉంటుందని నోస్, ఫేస్ ఇన్ఫెక్షన్‌తో తీవ్ర ఇబ్బందులు పడుతుండగా ఆరోగ్యశ్రీ కార్డు ద్వారా వెళితే సమస్య పరిష్కారం కాలేదని మూడు నాలుగు నెలల్లో చూద్దామని చెప్పారన్నారు. విషయాన్ని మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకువెళ్లగా మూడు రోజుల్లో సమస్య పరిష్కరించి తన కుమార్తె ఇబ్బంది తీర్చారని చెప్పారు. కాగా ప్రకాశం జిల్లా మార్కాపురంకు చెందిన ఎస్ సుశాంతి ఓ ప్రైవేటు ఫార్మసీ కళాశాలలో లెక్చరర్‌గా పని చేస్తూ ద్విచక్రవాహనంపై వెళుతుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో తలకు తీవ్ర గాయమై కోమాలోకి వెళ్లారు. అప్పటికే ఆమె ఆరు నెలల గర్భవతి. వైద్యసాయం కోసం ఎక్స్ ద్వారా మంత్రి నారా లోకేశ్‌ను సంప్రదించగా తక్షణమే స్పందించిన లోకేశ్ సీఎంఆర్ఎఫ్ ద్వారా ఐదు లక్షల సాయం అందించి మహిళ ప్రాణాలు నిలిపారు. రాష్ట్ర ప్రభుత్వం 35 ఏళ్ల క్రితం తనకు అసైన్డ్ చేసిన 1.04 ఎకరాల భూమిని గణపవరం గ్రామానికి చెందిన జె చంద్రరావు కుటంబం ఆక్రమించిందని, ఏలూరు జిల్లా రాజవరానికి చెందిన ఎం రాజు మంత్రి లోకేశ్‌కు విజ్ఞప్తి చేయగా స్పందించిన లోకేశ్ అధికారులకు విషయం చెప్పగా గ్రామస్తుల సమక్షంలో భూమిని కొలిచి సర్వే చేసి సరిహద్దులు చూపించడంతో సమస్య పరిష్కారమయింది. ఇలా .... అనేక సమస్యలను మంత్రి లోకేశ్ పరిష్కరించడంతో ప్రజలు లోకేశ్ మా భరోసా అంటున్నారు.





గల్ఫ్ బాధితుల జీవితాలలో వెలుగులు నింపిన లోకేశ్

బతుకు దెరువు కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లి ఏజెంట్ చేతిలో మోసపోయిన వారికి నేనున్నాంటూ మంత్రి లోకేశ్ అండగా నిలిచారు. చాలీ చాలని జీతాలతో అక్రమ నిర్బంధానికి గురై తీవ్ర ఇబ్బందులు పడుతున్న తమను స్వస్థలాలకు చేర్చాలని సోషల్ మీడియా వేదికల ద్వారా బాధితులు చేసిన విజ్ఞప్తులతో మానవత్వంతో స్పందించారు. గల్ఫ్‌లో చిక్కుకున్న దాదాపు 21మందిని రాష్ట్రానికి ర్పించి వారి కుటుంబాలలో వెలుగులు నింపడం గొప్పవిషయంగా ప్రజలు హర్షిస్తున్నారు. ముగిసిపోయిందనుకున్న తమ జీవితానికి మంత్రి లోకేశ్ ప్రాణం పోశారంటూ గల్ఫ్ బాధితులు కన్నీటితో లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఇలా... అనేక విజ్ఞప్తులు పరిష్కరిస్తూ వాటిని సంబంధిత శాఖలకు పంపుతూ లోకేశ్ నిర్వహిస్తున్న ప్రజాదర్బార్ 50 వ రోజుకు చేరుకుని ప్రజల మన్ననలు పొందింది.





దివ్యాంగుల సమస్యలను ఆలకిస్తూ.

విదర్భ 203 పరుగులకు ఆలౌట్



ధ్యాన్ (3 వికెట్లు)

మంగళగిరి, డిసెంబర్ 6 (ఆంధ్రజ్యోతి): విజయ్ మర్చంట్ ట్రోఫీలో భాగంగా కర్ణాటక, విదర్భ జట్ల మధ్య మూడు రోజుల మ్యాచ్ మంగళగిరి ఏసీఏ అంతర్జాతీయ క్రికెట్ మైదానంలో శుక్రవారం ప్రారంభమైంది. విదర్భ జట్టు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. తొలి ఇన్నింగ్స్‌లో 77.5 ఓవర్లలో 203 పరుగులు చేసి ఆలౌటయింది. విదర్భ బ్యాటర్లు కుష్ శర్మ 49, శైష్ భిసే 45, ఓం థోత్రే 40 పరుగులు చేయగా, కర్ణాటక బౌలర్లు ధ్యాన్ హిరేమత్ 3 వికెట్లు, సుజిత్ వేళన్ 2 వికెట్లు పడగొట్టారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కర్ణాటక జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి పది ఓవర్లలో వికెట్ నష్టానికి 31 పరుగులు చేసింది.

గంజాయి, ఎర్ర చందనం అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా

ఎస్పీ సతీశ్‌కుమార్ వెల్లడి



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

మంగళగిరి సిటీ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎర్ర చందనం, గంజాయి అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా వుంచామని, పట్టుబడిన వారిపై పీడీ యాక్టు కింద కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటున్నామని జిల్లా ఎస్పీ సతీశ్‌కుమార్ స్పష్టం చేశారు. ఎర్ర చందనం అక్రమ రవాణా కేసులో నిందితులను మంగళగిరి రూరల్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ వివరా లను మంగళగిరి సర్కిల్ కార్యాల యంలో శుక్రవారం ఎస్పీ సతీశ్‌కుమార్ మీడి యాకు వెల్లడించారు. తమిళనాడు నుంచి అస్సాం, గౌహతి, పశ్చిమ బెంగాల్‌లోని సిరు గురి మీదుగా ఎర్ర చందనం అక్రమ రవాణా జరుగుతున్నట్టు నిఘా వర్గాల నుంచి సమా చారం వచ్చిందన్నారు. మంగళగిరి రూరల్ సీఐ వై.శ్రీనివాసరావు, ఎస్ఐ సీహెచ్ వెంకట్‌లు సిబ్బందితో కలిసి ఈ నెల 4వ తేదీన కాజ టోల్‌ప్లాజా వద్ద వాహనాల తనిఖీ చేపట్టగా.. తమిళనాడుకు చెందిన టీఎన్52 హెచ్ 6683 నెంబరు గల పది చక్రాల లారీలో ఏ4 పేపర్ బండిల్స్ మధ్యలో ఎర్ర చందనం వున్నట్టుగా గుర్తించారని తెలిపారు. నిందితులు ఇద్దరు లారీని వదిలి పారిపోయారన్నారు. లారీని పోలీసు స్టేషన్‌కు తరలించి రెవెన్యూ, అటవీ శాఖ అధికారుల పర్యవేక్షణలో దుంగలను తూకం వేయగా 1201.87 కిలోల బరువు గల 49 దుంగలు లభించాయని, వీటి విలువ బహిరంగ మార్కెట్‌లో సుమారు రూ.3.5 కోట్లు వుంటుందని తెలిపారు. నిందితుల కోసం గాలింపు చేపట్టగా తమిళనాడు రాష్ట్రం నామకల్ జిల్లాకు చెందిన సారథి కన్నన్, చెన్నయ్‌కు చెందిన జోయ్ ప్రవీణ్‌లను గురువారం అదుపులోకి తీసుకొని నిందితులపై అటవీ పరిరక్షణ చట్టం, దొంగతనం, ఎర్ర చందనం స్మగ్లింగ్, పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశామన్నారు. తమిళనాడులోని ఓ వ్యక్తి ఆదేశాల మేరకు డబ్బు ఎక్కువగా వస్తుందన్న ఆశతో ఎర్ర చందనం స్మగ్లింగ్‌కు పాల్పడుతున్నట్టు నిందితులు తెలిపారన్నారు. కోల్‌కత, గౌహతి, సిరుగురి తదితర ప్రాంతాల మీదుగా చైనా దేశానికి ఎర్ర చందనం అక్రమంగా తరలిస్తున్నట్టు విచారణలో తేలిందన్నారు. ఈ కేసులో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి మరింత లోతుగా దర్యాప్తు చేపడతామని ఎస్పీ సతీశ్‌కుమార్ వెల్లడిం చారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ ఏటీవీ రవికుమార్, డీఎస్పీలు సీహెచ్ మురళీకృష్ణ, భార్గవి, మంగళగిరి రూరల్, అర్బన్ సీఐలు వై.శ్రీనివాసరావు, డి.వినోద్ కుమార్, ఎస్ఐ చిరుమామిళ్ల వెంకట్, సిబ్బంది పాల్గొన్నారు.



దుంగలను పరిశీలిస్తున్న ఎస్పీ

స్పా ముసుగులో వ్యభిచారం

- 17 మసాజ్ సెంటర్లలో పోలీసుల ఆకస్మిక దాడులు
- పోలీసుల అదుపులో థాయిల్యాండ్, నార్త్ ఇండియా యువతులు
- ఆయా సెంటర్లలో ఏర్పాట్లతో షాక్ కు గురైన పోలీసులు

గుంటూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మసాజ్ సెంటర్ల ముసుగులో గుంటూరు నగరంలో సాగుతున్న హైటెక్ వ్యభిచారం గుట్టురట్టయింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నాటి మంత్రి తనయుడు గుంటూరు కేంద్రంగా పలు స్పా సెంటర్‌లు నిర్వహించినట్లు ఆరోపణలు ఉన్నాయి. పోలీసులకు తెలిసినప్పటికీ ఆయా సెంటర్ల వైపు కన్నెత్తి చూడలేదు. దీంతో ఆయా మసాజ్ సెంటర్లకు జిల్లాతో పాటు పొరుగు జిల్లాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో విటులు క్యూ కట్టారు. ఈ విషయంపై నిఘా వర్గాలకు సమాచారం అందింది. దీంతో జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ నగర పరిధిలోని సుమారు 17 మసాజ్ సెంటర్లలో దాడులకు ఆదేశాలివ్వగా శుక్రవారం ఆయా పోలీస్ బృందాలు ఏకకాలంలో మసాజ్ సెంటర్లపై ఆకస్మిక దాడులు నిర్వహించాయి. పట్టాభి పురం, అరండల్‌పేట, నల్లపాడు పోలీస్ స్టేషన్ల పరిధిలోని మసాజ్ సెంటర్లలో ఈ దాడులు సాగాయి. లక్ష్మీపురంలోని తుర, అయాన్, స్థంబాలగరువు సమీపంలోని స్టూడియో 11, బ్రాడీపేట 4/13 లోని కుకుంబర్, బృందావన్ గార్డెన్స్‌లోని షై స్పా, సాయిబాబా రోడ్డు సమీపంలోని యూని వర్సల్, కళ్యాణ్ రోడ్డులో గల ఎస్‌బీసీసీ స్పా, మారుతి నగర్ ఆర్చ్ సెంటర్లోని టూనీ అండ్ గైస్ సెంటర్ లతోపాటు నల్లపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఇన్నర్ రింగ్ రోడ్‌లో, అమరావతి రోడ్‌లోని మరికొన్ని స్పా సెంటర్‌లపై పోలీసులు ఈ దాడులు నిర్వహించారు. సీసీఎస్ అదనపు ఎస్పీ సుప్రజ, వెస్ట్ డీఎస్పీ జయరాం ప్రసాద్ లతోపాటు సంబంధిత సీఐలు, ఎస్ఐలు బృందాలుగా ఈ దాడులు నిర్వహించారు.



తుర మసాజ్ సెంటర్‌లో థాయ్ యువతులను విచారిస్తున్న ఏఎస్పీ సుప్రజ, సీఐ వీరాస్వామి

తుర స్పా సెంటర్‌లో హైటెక్ వ్యభిచారం ..

లక్ష్మీపురం మెయిన్ రోడ్డుపై ఉన్న తుర స్పా సెంటరులో నిబంధనలకు విరుద్ధంగా అనేక సౌకర్యాలు కల్పించారు. ఆయా సదుపాయాలను పరిశీలించిన పోలీసులు షాక్ కు గురయ్యారు. ఈ స్పా సెంటర్‌లోకి వెళ్లాలంటే బిల్డింగ్ పార్కింగ్‌లో ఉన్న లిఫ్ట్ ద్వారా మాత్రమే పైకి వెళ్లాలి. దీనికి అన్ని వైపులా సీసీ కెమెరాలు అమర్చారు. స్పా సెంటర్లో ఉన్న నిర్వాహకులు ఆయా సీసీ కెమెరాల ద్వారా ఈ సెంటర్ లోకి వచ్చే వారిని ముందుగానే పసిగడతారు. అంతేగాక ప్రత్యేకంగా సమాచారం ఇవ్వడానికి ఇక్కడ ఒకరిని నియమించుకున్నారు. అంతేగాక వారందరి వద్ద వాకి టాకీ ఫోన్‌లు ఉండడం గమనార్హం. అంతేగాక నిబంధనలకు విరుద్ధంగా ఈ సెంటర్‌లో మంచాలు, పరుపులు ఏర్పాటు చేశారు. పోలీసులు దాడిచేసిన సమయంలో కొన్ని గదులకు బయట నెంబర్ లాక్ చేశారు. పోలీసులు బలవంతంగా వారి ద్వారా లాక్ తెరిపించారు. ఆయా గదుల్లో అమ్మాయి, అబ్బాయి జంటలు ఒంటిపై దుస్తులు లేకుండా పోలీసులకు పట్టుబడ్డారు. మసాజ్‌కు సంబంధం లేని పలు క్రీములను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సెంటర్లో థాయిలాండ్‌కు చెందిన నలుగురు, నార్త్ ఇండియాకి చెందిన ముగ్గురు యువతులు ఉన్నారు. వారితో పాటు చీరాల పరిధిలోని ఈపూరుపాలెంకు చెందిన పడవల ప్రభాత్, అతిథి వెంకటేశ్వరరావు, చిలకలూరిపేటకు చెందిన తుమ్మల హరీష్ అనే విటులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అదేవిధంగా స్పా సెంటర్ మేనేజర్ అయిన కిరణ్ కుమార్‌ని కూడా అదుపులోకి తీసుకు న్నారు. ఈ స్పా సెంటర్ బెంగళూరుకు చెందిన ఆసిఫ్ నిర్వహిస్తున్నట్లు పోలీసుల దృష్టికి వచ్చింది. ఈ తుర సెంటర్‌లో సిసిఎస్ అదనపు ఎస్పీ సుప్రజ, అరండల్ పేట సీఐ వీరాస్వామి, సిబ్బంది దాడి చేశారు. ఈ సెంటర్ నుంచి ఏడుగురు యువతులు, ముగ్గురు విటుల తోపాటు మేనేజర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అదేవిధంగా నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇన్నర్ రింగ్‌రోడ్ లోని మసాజ్ సెంటర్లలో సీఐ వంశీధర్ ఆధ్వర్యంలో సిబ్బంది దాడులు చేశారు. ఈ సందర్భంగా పలు మసాజ్ సెంటర్లలో కార్యకలాపాలు అనుమానాస్పదంగా ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. అయితే ఈ దాడుల సందర్భంగా వ్యభిచార కార్యకలాపాలకు సంబంధించిన ఆధారాలు లభ్యం కాలేదు.

10న లలితకళా ఉత్సవం

- డాక్టర్ ఎన్ మంగాదేవి స్వీయకథ పుస్తకావిష్కరణ
- భిన్నరంగాలకు చెందిన ముగ్గురికి సాహిత్య పురస్కారాలు

గుంటూరు(విద్య),డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఈనెల 10న 27వ లలితకళాఉత్సవం ఘనంగా నిర్వహించేందుకు శ్రీవెంకటేశ్వర బాలకుటీర్ వ్యవస్థాపకులు డాక్టర్ నన్నపనేని మంగాదేవి ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. గుంటూరు నగరంలోని ఏటి అగ్రహారం జీరోలైనులోని ఎంఎస్ఆర్ కన్వెన్షన్‌లో జరిగే వేడుకల్లో ముగ్గురు ప్రముఖులకు సాహిత్య పురస్కారాలు అందించనున్నారు. కర్నూలుకు చెందిన ఉపాధ్యాయుడు, బాల సాహితీవేత్త డాక్టర్ ఎం హరికిషన్‌కు మంగాదేవి బాలసాహిత్య పురస్కారం అందిస్తారు. ఇందులో భాగంగా రూ. 25వేలు నగదు, జ్ఞాపిక ఇవ్వనున్నారు. ఇంకా స్త్రీవాద రచయిత సి సుజాతకు మాలతీ ప్రమదా సాహిత్య పురస్కారం, రూ. 25వేలు నగదు, జ్ఞాపిక అందిస్తారు. వర్ధమాన రచయిత్రి ఎ లక్ష్మీ అహలకు ప్రతిభా పల్లవం పురస్కారంతో పాటు రూ. 10 వేలు నగదు, జ్ఞాపిక అందిస్తారు. వేడుకలకు కేంద్ర సాహిత్య అకాడమి భాషా సమ్మాన్ పురస్కార గ్రహీత ఆచార్య బేతవోలు రామబ్రహ్మం హాజరై పురస్కారాలు పంపిణీ చేస్తారు.



పురస్కారం అందుకోనున్న డాక్టర్ ఎం హరికిషన్

అదే విధంగా శ్రీవెంకటేశ్వర బాలకుటీర్ వ్యవస్థాపకురాలు డాక్టర్ ఎన్ మంగాదేవి స్వీయకథ 'అంకురం నుంచి అనంతం' పుస్తకాన్ని ప్రముఖ రచయిత విమర్శకుడు, చిత్రకారుడు, వాడ్రేవు చినవీరభద్రుడు ఆవిష్కరించనున్నారు. రాష్ట్రస్థాయిలో నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థిని విద్యార్థులకు వివిధ విభాగాల్లో బహుతులు అందిస్తారు.

పట్టభద్రుల ఓటు నమోదుకు

కొత్తగా 53 వేల దరఖాస్తులు

- 6వ తేదీ వరకు వచ్చిన క్లెయిమ్‌లన్నీ పరిష్కారం
- 9వ తేదీ సాయంత్రం వరకు దరఖాస్తు దాఖలుకు గడవు

గుంటూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కృష్ణా - గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలో ఓటరు నమోదు ప్రక్రియలో భాగంగా ముసాయిద ఓటర్ల జాబిత ప్రచురణ అనంతరం కూడా వేలల్లో దరఖాస్తులు వచ్చాయి. గత నెల 23వ తేదీన డ్రాఫ్టు ఓటరు లిస్టుని ప్రచురించిన తర్వాత ఈ నెల 9వ తేదీ వరకు క్లెయిమ్‌లు/అభ్యంతరాల దాఖలుకు ఎన్నికల సంఘం గడవు ఇవ్వడంతో ఇంకా ఓటరుగా నమోదు కాని వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొంటున్నారు. ముసాయిద ఓటర్ల జాబితా ప్రచురణ అనంతరం మరో 53 వేలకు పైగా దరఖాస్తులు ఆరు జిల్లాల నుంచి రావడం విశేషం. ఇంకా మూడు రోజుల గడవు సమయం ఉండటంతో ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు అధికారవర్గాలు అంచనా వేస్తున్నాయి.

మరో నాలుగు నెలల్లో జరగనున్న కృష్ణా - గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక కోసం ఎలక్షన్ కమిషన్ ఓటరు నమోదు ప్రక్రియని ప్రారంభించిన విషయం తెలిసిందే. ఎవరైతే 2021 నవంబరు 1వ తేదీ నాటికి డిగ్రీ పట్టాని పొంది ఉంటారో వారందరికి ఓటరుగా నమోదు చేసుకొనే అవకాశం కల్పించింది. దీంతో గుంటూరు, పల్నాడు, బాపట్ల, కృష్ణ, ఎన్‌టీఆర్, ఏలూరు జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో పట్టభద్రులు దరఖాస్తు చేసుకొన్నారు. ఇప్పటికే 2 లక్షల 90 వేల 978 మంది పట్టభద్రులకు ఈ ఆరు జిల్లాల్లో ఓటు హక్కు కల్పించారు.

తుది ఓటర్ల జాబితా ప్రచురణ తేదీలు సమీపిస్తున్న దృష్ట్యా క్లెయిమ్‌ల సందర్భంగా వస్తోన్న దరఖాస్తులను మరుసటి రోజే పరిశీలన జరిపించి పరిష్కరిస్తున్నారు. ఆ విధంగా శుక్రవారం ఈ నెల 6వ తేదీ సాయంత్రం వరకు వచ్చిన దరఖాస్తులను పరిష్కరించామని ఈఆర్‌వో ఎన్ షేక్ ఖాజావలి 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. ఓటుహక్కు కోసం ఈ నెల 9 వరకు గడవు ఉన్నందున పట్టభద్రులు దరఖాస్తు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

నూతన ఆవిష్కరణలకు సిద్ధంకండి !

- సాంకేతిక విద్యార్థులకు ఎమ్మెల్యే బూర్ల పిలుపు
- నల్లపాడు ఎంబీటీఎస్ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో రాష్ట్ర స్థాయి టెక్‌ఫెస్ట్ ప్రారంభం



ప్రదర్శన తిలకిస్తున్న విద్యార్థులు

గుంటూరు(విద్య),డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): సాంకేతిక విద్యలో వస్తున్న ఆధునిక మార్పుల్ని విద్యార్థులు అందిపుచ్చుకుని నూతన ఆవిష్కరణలకు సిద్ధం కావాలని, ఇందుకు ప్రభుత్వం చేయూత నిస్తుందని పత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు అన్నారు. శుక్రవారం నల్లపాడులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో రాష్ట్రస్థాయి టెక్‌ఫెస్ట్ ప్రారంభం సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సాంకేతిక విద్య పూర్తిచేసిన వారికి ఉద్యోగ ఉపాధి అవకావాలు విస్తృతంగా ఉన్నాయని, ఇందుకోసం తొలుత ప్రభుత్వం అందించే శిక్షణను సద్వినియోగం చేసుకోవాలనికోరారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ స్వప్నిల్ పవర్ జగన్నాథ్, కొమ్మాలపాటి శ్రీనివాసరావు, కళాశాల ప్రిన్సిపాల్ టీ.శేఖర్, అధ్యాపకులు, బోధనే తర సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా మొత్తం 113 వినూత్న ఆవిష్కరణలను విద్యార్థులు ఏర్పాటు చేశారు. నల్లపాడులోని కేంద్రీయ విద్యాలయం, నగరంలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు స్కూల్స్ విద్యార్థులు ప్రదర్శనను సందర్శించారు.



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

పోక్సో కేసులో నిందితుడికి రిమాండ్

నరసరావుపేట లీగల్, డిసెంబరు 6: పోక్సో కేసులో నిందితుడైన పట్నంలోని బరంపేటకు చెందిన కటారి గోపికి రిమాండ్ విధిస్తూ స్థానిక మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయాధికారి ప్రవళిక శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. నిందితుడు పట్టణానికి చెందిన ఓ విద్యార్థినితో అసభ్యకరంగా ప్రవర్తించినట్లు కేసు నమోదయింది. కేసు నమోదు చేసుకున్న పోలీసు ప్రాథమిక దర్యాప్తు అనంతరం నిందితుడుని అరెస్ట్ చేసి కోర్టులో ప్రవేశపెట్టగా న్యాయాధికారి రిమాండ్ విధించారు.

విజయసాయిరెడ్డి పద్ధతిగా మాట్లాడాలి: కొమ్మాలపాటి

నరసరావుపేట టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకుడు విజయసాయిరెడ్డి ఒళ్లు దగ్గరపెట్టుకొని మాట్లాడితే పద్ధతిగా ఉంటుందని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. చంద్రబాబునాయుడుపై నోటికొచ్చినట్లు అవాకులు, చవాకులు పేలితే టీడీపీ క్యాడర్ చూస్తూ ఊరుకోదన్నారు. చంచెలగూడ జైలు జీవితం చూసిన నీకు రాజమండ్రి సెంట్రల్ జైల్ జీవితం కూడా ఉంటుందన్నారు. మీ ఐదేళ్ల అక్రమాల ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయని, మీ అక్రమ సంపాదన కోసం రాష్ట్రాన్ని సర్వనాశనం చేసింది వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. నవ్వు నీ నోటికి పనిచెబితే మేము మా చేతులకు పని చెప్పాల్సి ఉంటుందని హెచ్చరించారు.

విరాళాల సేకరణ ప్రారంభించిన కలెక్టర్

నరసరావుపేట లీగల్, డిసెంబరు 6: పల్నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని పీజీఆర్ సమావేశ మందిరంలో శుక్రవారం జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు సాయుధ బలగాల పతాక దినోత్సవం విరాళాల సేకరణ కార్యక్రమం ప్రారంభించారు. ఈ నెల 7న నిర్వహించే ఈ కార్యక్రమ నిర్వహణ కోసం విరాళాల సేకరణను శుక్రవారం లాంఛనంగా ప్రారంభించారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

శావల్యాపురం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వినుకొండ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని శావల్యాపురం, నూజండ్ల, వినుకొండ రూరల్ మండలాల్లోని వివిధ గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న కార్యకర్త, సహాయకురాలు పోస్టులకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీచేసిందని, అర్హులైన వారంతా ఆయా పోస్టులకు దరఖాస్తులు చేసుకోవాలని వినుకొండ ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో ముదివర్తి అనురాధ శుక్రవారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ వినుకొండ మండలం నడిగడ్డ, శావల్యాపురం మండలం కృష్ణాపురం, నూజెండ్ల మండలం తిమ్మాపురం గ్రామాల్లో అంగన్‌వాడీ టీచర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. వినుకొండ మండలంలోని వెంకుపాలెం, హస్సన్నాయుడుపాలెం, పిట్టంబండ్ల-1, పిట్టంబండ్ల-3, పానకాలపాలెం, శావల్యాపురం మండలంలోని చిన్నకంచెర్ల-1, శావల్యాపురం-4, నూజండ్ల మండలంలోని పువ్వాడ, కొండరాయునిపాలెం, కొత్తనాగిరెడ్డిపల్లె, కొత్తరెడ్డిపాలెం, భూమాయపాలెం, గాంధీనగర్‌లలో అంగన్‌వాడీ ఆయాల పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. దరఖాస్తులను ఈ నెల 18వ తేదీలోపు వినుకొండ సీడీపీవో కార్యాలయంలో అందజేయాలన్నారు. వివరాలకు 9493523521ను సంప్రదించాలన్నారు.

8న భగవద్గీత కంఠస్థ పోటీలు

నరసరావుపేట టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): గీతా జయంతి పురస్కరించుకొని శ్రీమద్ భగవద్గీత కంఠస్థ పోటీలు ఈ నెల 8న పట్టణంలోని కుసుమ హరనాథ బాబా మందిరంలోని కల్యాణ మండపంలో జరుగుతాయని శుక్రవారం నిర్వాహకులు అయినవోలు సాంబశివరావు తెలిపారు. ఈ సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్ నిర్వహించే ఈ పోటీల పోస్టర్‌ను పట్టణంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు విడుదల చేశారు.

వడ్లమూడివారిపాలెంలో అగ్ని ప్రమాదం

రొంపిచర్ల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వడ్లమూడివారిపాలెంలో శుక్రవారం అగ్ని ప్రమాదం జరిగి పూరిల్లు దగ్ధమైంది. గ్రామానికి చెందిన మేకల వెంకాయమ్మ గృహంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఈ ప్రమాదం జరిగినట్టు తెలిపారు. ఇంట్లో మంటలు వ్యాపించటంతో నిద్రిస్తున్న వెంకాయమ్మ బయటకు వచ్చింది. చుట్టుపక్కల వారు వచ్చి మంటలను ఆర్పేందుకు ప్రయత్నించినా సాధ్యంకాలేదు. అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. రూ.5 లక్షలమేర ఆస్తి నష్టం వాటిల్లినట్టు బాధితురాలు తెలిపారు. సంఘటనా స్థలాన్ని తహసీల్దార్ నిర్మల సందర్శించారు. రూ. 2వేలు ఆర్థికసాయం చేశారు. కార్యక్రమంలో ఆర్ఐ కోటేశ్వరరావు, వీఆర్వో పడాల సుబ్బారెడ్డిలు పాల్గొన్నారు.

ముద్రా లోన్ చెక్కులు పంపిణీ

ఈపూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముప్పాళ్ళలో చేనేత కార్మికులకు మంజూరైన ముద్రాలోన్ చెక్కులను శుక్రవారం ఎస్‌బీఐ బ్యాంకులో కూటమి నేతలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి రాపర్ల జగ్గారావు మాట్లాడుతూ పేదల అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలను ప్రణాళిక ప్రకారం అమలు పరుస్తోందని అన్నారు. కార్యక్రమంలో విడపలపాటి హనుమయ్య, జాస్తి బుచ్చారావు, దండే కోటేశ్వరరావు, సురేష్, సూరే వెంకటనర్సయ్య, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు సెంటర్లు ఏర్పాటుచేయాలి

వినుకొండ టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు సెంటర్లను ఏర్పాటుచేసి కొనుగోళ్లు చేయాలని రైతు సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి ఉలవలపూడి రాము ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ మురళిని కలిసి వినతిపత్రం అందజేసి, మాట్లాడుతూ కొనుగోలు సెంటర్లు ఏర్పాటు చేయకపోవడంతో దళారుల వల్ల రైతులు నష్టపోవాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో పగడాల సుధాకరరెడ్డి, బ్రహ్మం, బాలస్వామి, వెంకయ్య తదితరులు ఉన్నారు.

భూ సమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు

● చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు



రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

బొల్లాపల్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తోందని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. మండల కేంద్రమైన బొల్లాపల్లిలోని రామాలయం వద్ద ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సులో జీవీ ఆంజనేయులు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా ఎదురు చూస్తున్న భూ సమస్యలు పరిష్కరించేందుకే రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ గ్రామాన 33రోజుల పాటు జరగనున్న రెవెన్యూ సమస్యలు పరిష్కరించటం జరుగుతుందన్నారు. రైతులు ఇచ్చిన అర్జీలు స్వీకరించి 45రోజుల్లో పరిష్కరించటం జరుగుతుందన్నారు. మూడు నెలల్లో సర్వేలన్నీ పూర్తిచేసి రైతుల సమస్యలను పరిష్కరించటం జరుగుతుందన్నారు. రైతులు ఎప్పటి నుంచో ఎదురు చూస్తున్న వారికి పట్టాలు ఇవ్వాలని, రానున్న మూడు నెలల్లో సర్వేలన్నీ పూర్తిచేసి పట్టాలు ఇవ్వాలని ఆర్డీవో మధులత, జిల్లా యంత్రాంగానికి సూచించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ వర్ధంతిని పురస్కరించుకొని అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి జీవీ ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్డీవో కే మధులత, తహసీల్దార్ ఏ సుధాకర్, టీడీపీ నాయకులు పెమ్మసాని నాగేశ్వరరావు, ఆరికట్ల వాసుదేవరెడ్డి, జరపాల గోవిందు నాయక్, తిప్పిశెట్టి వెంకటేశ్వర్లు, ఎలిశెట్టి రంగయ్య, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

● రొంపిచర్ల: భూ సమస్యల పరిష్కారమే రెవెన్యూ సదస్సుల ముఖ్య ఉద్దేశమని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు శుక్రవారం పేర్కొన్నారు. మండలంలోని విప్పర్ల గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో పులుకూరి జగ్గయ్య, జెల్లిపల్లి శేషమ్మ, రామిశెట్టి కోటయ్య, ఇమ్మడిశెట్టి కాశయ్య తదితరులు పాల్గొన్నారు.

● ఈపూరు: మండల కేంద్రమైన ఈపూరు సచివాలయంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ముందుగా గ్రామంలోని ఎస్సీ కాలనీలో రెవెన్యూ సదస్సు ర్యాలీ నిర్వహించారు. అనంతరం సచివాలయంలో అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సదస్సులో భూ సమస్యలపై 12 ఫిర్యాదులు అందినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దారు ఏ నళిని, మండల ప్రత్యేకాధికారి రమణారెడ్డి, ఎంపీడీవో కే ప్రభాకరరావు, టీడీపీ జిల్లా అధికారప్రతినిధి ఆర్.జగ్గారావు తదితరులు పాల్గొన్నారు.

● వినుకొండ: మండలంలోని గోకనకొండ గ్రామంలో మండల ప్రత్యేక అధికారి శ్రీరాములు ఆధ్వర్యంలో తహసీల్దార్ సురేష్ గ్రామ సభలు నిర్వహించారు. గ్రామంలో భూములకు సంభందించిన 25 అర్జీలురాగా వెంటనే వాటిని సిబ్బంది సహాయంతో పరిష్కరించారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రీహరి, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

● కారుమంచి (శావల్యాపురం): మండల ప్రత్యేకాధికారి మూలె వెంకటరెడ్డి, తహసీల్దార్ సుజాతలు కారుమంచిలో జరిగిన రెవెన్యూ సదస్సులో పాల్గొని రైతుల నుంచి దరకాస్తులు స్వీకరించారు. భూవివాదాలకు- 3, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ల కోసం- 2, తహసీల్దార్ డిజిటల్ సిగ్నేచర్ కోసం- 6, ఎఫ్‌లైన్ కోసం-3 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు.

● యడ్లపాడు: మండలంలోని వంకాయలపాడు గ్రామసచివాలయం వద్ద శుక్రవారం మండల ప్రత్యేక అధికారి అధ్యక్షతన రెవెన్యూ అధికారులు గ్రామసభను నిర్వహించారు. ముందుగా గ్రామంలో పర్యటించి సదస్సులపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం సచివాలయం వద్దకు చేరుకుని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయశ్రీ, డిప్యూటీ తహసీల్దార్ అనూరాధ, ఎంపీడీవో హేమలత, మండల సర్వేయర్ సురేంద్ర, ఇన్‌చార్జి ఆర్ఐ జయరాజు, వీఆర్వో శివకోటేశ్వరరావు, గ్రామ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

● నాదెండ్ల: మండలంలోని సాతులూరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం రెవెన్యూ గ్రామ సభలు నిర్వహించారు. ఐదు పట్టా దారు పాసు పుస్తకాలు, మూడు కొలతల సమస్యలపై అర్జీలను గ్రామస్తులు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఏవీ రమణ, డిప్యూటీ తహసీల్దార్ ధనలక్ష్మి, ఎంపీడీవో స్వరూపరాణి, సర్పంచ్ ముసుగు శోభారాణి, టీడీపీ అధ్యక్షుడు బండారుపల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

● దొండపాడు (నరసరావుపేట రూరల్): నరసరావుపేట మండలం దొండపాడులో గ్రామ రెవెన్యూ సదస్సు శుక్రవారం నిర్వహించారు. సదస్సులో మండల తహసీల్దార్ కె. వేణుగోపాలరావు, జిల్లా వ్యవసాయ అధికారి ఐ.మురళి, ఎంపీడీవో టి.కృష్ణకుమారి, మండల వ్యవసాయ అధికారి వి.నరేంద్రబాబు హాజరై గ్రామ ప్రజల వద్ద నుంచి అర్జీలను స్వీకరించారు.

● రొంపిచర్ల: విప్పర్లలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 25 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ బండి నిర్మల తెలిపారు. కార్యక్రమంలో వీఆర్వో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌కు ఘన నివాళి



డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు తదితరులు

నరసరావుపేట టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట నియోజకవర్గంలో భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్ధంతి కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 68వ వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ భారత రాజ్యాంగ రూపకర్త, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి అలుపెరగని కృషిచేసిన మహనీయుడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అన్నారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు. పల్నాడు జిల్లా టీడీపీ కార్యాలయంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి టీడీపీ నాయకులు నివాళి అర్పించారు. కార్యక్రమంలో మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ సాతులూరి కుమార్, రాష్ట్ర తెలుగు రైతు అధికార ప్రతినిధి గొట్టిపాటి జనార్ధన్‌బాబు, తెలుగు యువత ఉపాధ్యక్షుడు షేక్ రఫీ, సునీల్, జీపీ కుమార్, మధు, శ్యామ్, వర్ల బాబురావు, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

● నరసరావుపేట టౌన్: భారత బాబాసాహెబ్ అంబేద్కర్ 68వ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని గడియార స్తంభం సెంటర్‌లోని విగ్రహానికి శుక్రవారం మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

● రొంపిచర్ల: మండలంలోని నలగార్లపాడులో దళిత బహుజన హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు గోదా రమేష్ కుమార్ ఆ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

● నరసరావుపేట టౌన్: పట్టణంలోని బాపనయ్య నగర్‌లో అంబేద్కర్ విగ్రహానికి శుక్రవారం మాలమహానాడు, జేబీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. ఎప్పై కృష్ణ, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు గోదా జాన్‌పాల్ డాక్టర్ బాబురాజేంద్రప్రసాద్ స్కూల్‌లో 30మంది విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, పెన్సిల్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో పుస్తెల జయరావు, జనజాగృతి మహిళా మండలి అధ్యక్షురాలు పిడదల రమాదేవి, సేవా సామేలు, మెదబలిమి సాంబశివ, బుదాటి సంసోను, సంద్ర వెంకట్, తాతపూడి మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు. నరసరావుపేటలో మాదిగ రిజర్వేషన్ పోరాట సాధన సమితి ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్ళు అర్పించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు చింతిరాల మీరయ్య, గుంజరా రవి, కొండెపోగు రమణరావు, సీహెచ్ సాల్మన్‌రాజు, మల్లెల మధు, తదతరులు పాల్గొన్నారు.

● శావల్యాపురం: శావల్యాపురం సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి మండలంలోని వివిధ ఉపాధ్యాయ సంఘాల నేతలు శుక్రవారం ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యాయ సంఘాలనేతలు బీవీ నాగేశ్వరరావు, వెంకటరత్నం, రాజారమేష్, కంప శ్రీనివాసరావు, సురేష్, గురుబాబు, నిర్మల, పీడీ రాధాకృష్ణమూర్తి పాల్గొన్నారు. అనంతరం మాలమహానాడు వినుకొండ నియోజకవర్గ అధ్యక్షులు కీర్తిపాటి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మాలమహానాడు నేతలు అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించారు.

● బొల్లాపల్లి: ఎంపీడీవో కార్యాలయం వద్ద గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోటా నాయక్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి ఘనంగా నివాళులర్పించారు.

● ఈపూరు: మండల కేంద్రమైన ఈపూరు వసతి గృహాలలో శుక్రవారం అంబేద్కర్ వర్ధంతి శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలోటీడీపీ ఎస్సీసెల్ నాయకుడు మీసాల చిన్న ప్రసాదు, కే దేవదానం,వార్డెన్ బీ వెంకటేశ్వర్లు నాయక్, విద్యార్థులు పాల్గొన్నారు.

● వినుకొండ: పట్టణంలోని ప్రజాసంఘాల ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతివరప్రసాద్, నియోజకవర్గ కార్యదర్శి బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. నర్సరావుపేటరోడ్డులోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పల్నాడు జిల్లా కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు జి.అలెగ్జాండర్, వినుకొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బి.రామాంజనేయులు తదితరులు ఉన్నారు.

బాల్య వివాహాల నివారణపై గోడపత్రిక ఆవిష్కరణ

నరసరావుపేట లీగల్, డిసెంబరు 6: స్థానిక కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశం మందిరంలో శుక్రవారం జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు బాల్య వివాహాల నివారణపై గోడ పత్రిక ఆవిష్కరించారు. బాలలకు బాల్యాన్ని అందించండి బాధలను కాదు అనే నినాదంతో కూడిన ఈ పోస్టరును ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన పలువురు ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.



మోడల్ వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలిస్తున్న ప్రకృతి డీపీఎం అమలకుమారి

ప్రకృతి వ్యవసాయ విధానంతో రైతుల ఆదాయం రెట్టింపు

● డీపీఎం అమలకుమారి

యడ్లపాడు, డిసెంబరు 6 (ఆంధ్రజోతి): ప్రకృతి వ్యవసాయ విధానంలో పంటలను సాగుచేస్తే రైతుల ఆదాయం రెట్టింపు అవుతుందని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ అమలకుమారి అన్నారు. శుక్రవారం మండలంలోని చెంఘీజ్‌ఖాన్‌పేట, సంగంగోపాలపురం గ్రామాల్లో నిరంతరం ఆదాయం ఇచ్చే విధానం(ఏటీఎం)లో సాగుచేస్తున్న మోడల్ వ్యవసాయ క్షేత్రాలను ఆమె సందర్శించారు. ముందుగా చెంఘీజ్‌ఖాన్‌పేటకు చెందిన రైతు సాగి శ్రీనివాసరావు బొప్పాయి తోటలో అంతర పంటలుగా వేసిన చిక్కుడు, బంతి, కొత్తిమీర, ముల్లంగి, గోరు చిక్కుడు పైర్లను, సంగంగోపాలపురం గ్రామానికి చెందిన రైతు ఏటీఎం విధానంలో సాగుచేసిన ఆకు కూరలు, కూరగాయలు, తీగ, దుంపజాతి పంటలను పరిశీలించారు. రక్షక పంటగా చుట్టూ మొక్కజొన్న, సజ్జ వేయటాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులంతా ప్రకృతి సేద్యంలో పంటలను పండించి నాణ్యమైన పురుగుమందుల అవశేషాలు లేని ఉత్పత్తులను ప్రజలకు అందించాలని కోరారు.

రాష్ట్రస్థాయి కళా ఉత్సవ్ పోటీలకు వేల్పూరు విద్యార్థులు



బాలోత్సవ్‌లో ప్రతిభచూపిన వేల్పూరు విద్యార్థులు

వేల్పూరు (శావల్యాపురం) డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయిలో జరిగిన కళా ఉత్సవ్ పోటీల్లో శావల్యాపురం మండలం వేల్పూరు జడ్పీ పాఠశాలకు చెందిన విద్యార్థులు అత్యుత్తమ ప్రదర్శనతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం మహబూబ్ సుభానీ శుక్రవారం తెలిపారు. హెచ్ఎం మాట్లాడుతూ ఎన్‌సీఈఆర్టీ వారి ఆధ్వర్యంలో చిలకలూరిపేట సమీపంలోని బోయపాలెం డైట్ కళాశాల్లో శుక్రవారం నిర్వహించిన జిల్లాస్థాయి కళోత్సవం పోటీల్లో వేల్పూరు జడ్పీ పాఠశాలకు చెందిన విద్యార్థులు రోహిణి, శ్రావణి, భార్గవి, ప్రసన్న, హేమలత, మస్తాన్‌బీ, తులసి, అక్షయ, తేజ, వసంతలక్ష్మి పాల్గొని మైము, ఫోక్ డ్యాన్స్‌లలో మంచి ప్రదర్శనను ఇచ్చి అందరినీ ఆకట్టుకొన్నారని తెలిపారు. విజేతలకు డైట్ కళాశాల ప్రిన్సిపాల్ సుభానీ ప్రశంశాపత్రాలను అందజేసి ఘనంగా సత్కరించారు.

ఘనంగా హోంగార్డు వ్యవస్థాపక దినోత్సవం

నరసరావుపేట లీగల్ డిసెంబరు 6: హోంగార్డుల 62వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలను శుక్రవారం పట్టణంలోని కోడెల శివప్రసాదరావు స్టేడియంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎస్పీ కంచి శ్రీనివాసరావు హాజరై గౌరవ వందనం స్వీకరించారు. హోంగార్డులకు ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీలో విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. విధి నిర్వహణలో ప్రతిభ కనపరచిన వారికి ప్రశంశా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఏఆర్ అదనపు ఎస్పీ వి సత్యరాజు, డీఎస్పీ మహాత్మాగాంధీరెడ్డి ఆర్ఐఎస్ కృష్ణ పర్యవేక్షణలో హోంగార్డు సుధాకర్ పరేడ్ కమాండర్‌గా కవాతు నిర్వహించారు. కార్యక్రమంలో ఏవో కేవీడీ రామారావు ఎస్‌బీ సీఐ బండారు సురేష్‌బాబు, వెల్ఫేర్ ఆర్ఐ గోపీనాథ్ ఎం.రాజా సిబ్బంది పాల్గొన్నారు.

వంద రోజుల ప్రణాళికపై నివేదికలివ్వండి: కలెక్టర్

నరసరావుపేట కల్చరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) జిల్లాలో వంద రోజుల ప్రణాళిక పురోగతిపై ప్రణాళికలు సమర్పించాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 11, 12తేదీలలో సీఎం చంద్రబాబు నాయుడు నిర్వహించనున్న జిల్లా కలెక్టర్ల సమావేశం కోసం ఈ నివేదికలు ఇవ్వాలన్నారు. ప్రభుత్వం చేపట్టిన ఇసుక పాలసీ, పింఛన్ల పంపిణీ, మద్యం పాలసీ, అన్న క్యాంటీన్లు, సాగునీటి పథకాలు, రెవెన్యూ సదస్సులు, పీజీఆర్ఎస్, రోడ్ల మరమ్మతులు వంటి అంశాలకు సంబంధించి వివరాలు రేపటిలోగా అందించాలని ఆదేశించారు. అలాగే రానున్న రోజుల్లో జిల్లాలోని సంక్షేమ హాస్టళ్లలో వసతులను మెరుగుపరచడంపై శ్రద్ధ వహించాలని సంక్షేమ శాఖల అధికారులను ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ ఘనోరే, సీపీవో జి.శ్రీనివాస్ ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మొక్కజొన్న పంటలో కత్తెర పురుగును నివారించాలి

● జిల్లా వ్యవసాయ అధికారి మురళి

దొండపాడు (నరసరావుపేట రూరల్), డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దొండపాడులో మొక్కజొన్న పంటలను పల్నాడు జిల్లా వ్యవసాయ అధికారి ఐ మురళి పరిశీలించి కత్తెర పురుగు నివారణపై రైతులకు అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి ఐ.మురళి మాట్లాడుతూ రైతులందరూ పంటలను వేసే ముందు లోతు దిక్కులు దున్నుకోవడం వలన పురుగు నిద్రావస్థ, కూపస్థ దశలో నాశనం అవుతాయన్నారు. మొక్కజొన్న పంట చుట్టూ నాలుగు వరుసలు నేపియర్ గడ్డిని ఎరపంటగా వేసుకోవాలని, ఎకరానికి నాలుగు నుంచి ఐదు లింగాకర్షణ బుట్టలను ఏర్పాటు చేసుకొని పురుగు ఉధృతిని గమనిస్తుండాలని గుడ్ల సముదాయాలను గుర్తించి వేరువేసి నాశనం చేయాలన్నారు.



బాల్య వివాహలను నిర్మూలించాలని ప్రతిజ్ఞ చేయిస్తున్న ఆర్డీవో కే మధులత

బాల్య వివాహాలను అరికట్టాలి

● రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

బొల్లాపల్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల కేంద్రం బొల్లాపల్లిలో బాల్య వివాహాలను అరికట్టాలని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు శుక్రవారం పేర్కొన్నారు. అంగన్‌వాడీల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన బాల్య వివాహాలను అరికట్టాలి అనే కార్యక్రమంలో ఆర్డీవో కే మధులత బాల్య వివాహలపై ప్రతిజ్ఞ చేయించారు. బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ 18 సంవత్సరాల లోపు బాలికలు, 21 సంవత్సరాల లోపు బాలురు వివాహాలు చేసుకోకూడదన్నారు. తల్లీబిడ్డల ఆరోగ్యం బాగుండాలంటే బాల్య వివాహాలు చేయకూడదని, వీటిని ప్రోత్సహించ కూడదని, వాటిని పూర్తిగా అరికట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. బాల్య వివాహాలతో కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్డీవో కే మధులత, తహసీల్దార్ ఏ సుధాకర్, రెవెన్యూ సిబ్బంది, అంగన్ వాడీ కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా శ్రవణ నక్షత్ర పూజలు



ప్రత్యేక అలంకరణలో కల్యాణ వేంకటేశ్వర స్వామి

నరసరావుపేట అర్బన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మునిసిపల్ కార్యాలయ ఆవరణలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శ్రవణ నక్షత్రం సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ అర్చకులు చతుర్వేదుల భ్రమర కుమార్ శర్మ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం విశేష అలంకరణ చేసి స్వామివారిని భక్తులు దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



మహాప్రదర్శనలో పాల్గొన్న సీపీఎం నాయకులు సీహెచ్ బాబారావు, వీ కృష్ణయ్య, హరి కిషోర్, తదితరులు

హామీలపై ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేయాలి

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బాబురావు డిమాండ్

నరసరావుపేట టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుపై కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సీహెచ్ బాబురావు డిమాండ్ చేశారు. శుక్రవారం నరసరావుపేట పట్టణంలో మూడు రోజుల పాటు నిర్వహించే సీపీఎం పల్నాడు జిల్లా మహాసభల సందర్భంగా కార్యకర్తలు, నాయకులు, అభిమానులు భారీ ర్యాలీ నిర్వహించారు. పల్నాడు బస్టాండ్ సెంటర్‌లో జరిగిన బహిరంగ సభలో సీహెచ్ బాబురావు మాట్లాడుతూ నిత్యావసరాల ధరలు తగ్గిస్తామని, విద్యుత్ చార్జీలను పెంచబోమని, ఉచిత ఇసుక ఇస్తామని ఇచ్చిన హామీలు ఆచరణలో అమలు కావడం లేదన్నారు. బహిరంగ సభకు సీపీఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి డీ శివకుమారి, ప్రజానాట్యమండలి కళాకారులు టీ పెద్దిరాజు, సుందరయ్య, నాగమ్మబాయ్, జగన్, తోకల కోటేశ్వరరావు, సీపీఎం సీనియర్ నాయకులు గద్దె చలమయ్య, తదితరులు పాల్గొన్నారు.